
ప్రజ్ఞాబంధం
నా గురుదేవులతో . . .
స్వామి ప్రజ్ఞారణ్య మహరాజ్
- బ్రహ్మవిద్యాచైతన్య

ఓం అరుణాచలేశ్వరాయ నమః
ఓం నమో భగవతే శ్రీ రమణాయ

ప్రజ్ఞాబంధం

నాగురుదేవులతో...

పూజ్యశ్రీ స్వామి ప్రజ్ఞారణ్య మహరాజ్

యోగి ప్రోటోప్లాజమ్ స్వామీజీ

యోగి బ్రహ్మవిద్యా చైతన్య

యోగిరామ తపోవనం

ప్రజ్ఞాబంధం నా గురుదేవులతో
- యోగి బ్రహ్మవిద్యా చైతన్య

మొదటి ముద్రణ : 2022

ప్రతులు : 1000

వెల : భక్తి, శ్రద్ధ, విశ్వాసములు

ప్రతులకు :
యోగిరామ తపోవనము
అన్నారెడ్డి పాలెం, సంగం మండలం,
నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 524 306
సెల్ నెం. 83096 23320, 91778 23133

డి.టి.పి & ప్రింటింగ్ :
శ్రీవారి గ్రాఫిక్స్, తిరుపతి.
సెల్: 99484 34277

ఓం

పూజ్యశ్రీ ప్రజ్ఞారణ్య స్వామీజీ
శ్రీ బ్రహ్మ విద్యా చైతన్య
నివేదన

– డా॥ సముద్రాల లక్ష్మణయ్య
తిరుపతి.

'ఏకం సత్ విప్రా బహుధా వదన్తి' – అని శ్రుతి. తత్త్వజ్ఞులచే నానావిధాలుగా కీర్తింపబడిన పరతత్త్వం ఒక్కటే అని ఆవేదవాక్యానికి అర్థం. 'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే' అని సంకీర్తనాచార్యుడు బ్రహ్మైకత్వమును కీర్తించాడు. 'ఉందేది రాము దొకడె' అని భగవదవతార తత్త్వాన్ని వర్ణించిన హరిదాసులు సాకారం నిరాకారంలోనే అంతర్భవిస్తుందని గానం కావించారు.

పరతత్త్వం ఒక్కటే. దానిని వివరించే మతమే అద్వైతం. శ్రీశంకర భగవత్పాదులు అద్వైతాన్ని విస్తృతంగా ప్రచారం చేసి జగద్గురువుగా ప్రశస్తి పొందారు. వారిననుసరించి సాధన గావించిన పలువురు సాధకులు బ్రహ్మానంద సుఖం అనుభవించారు. సంసారసాగరాన్ని తాము తరించి ఇతరులను తరింపజేశారు.

'వివేక చూడామణి'లో

శాంతా మహాంతో నివసన్తి సన్తో
వసంతవల్లోకహితం చరంతః ।

తీర్ణాః స్వయం భీమభవార్ణవం జనా
నహేతునాఽన్యా నపి తారయంతః ॥

అన్న శ్లోకం అట్టి మహనీయులనే కీర్తించింది.

బ్రహ్మతత్త్వ ప్రతిపాదకమైన ఈ యోగమార్గాన్ని అనుసరించడం ప్రాచీనకాలానికి మాత్రమే పరిమితం కాలేదు. ఆధునికయుగంలో కూడా అద్వైతాన్ని అనుసరించి తరించినవారు, అనుయాయులను తరింప జేసినవారు అనేకులున్నారు.

అట్టి వారిలో ప్రథమ గణనీయులు శ్రీ భగవాన్ రమణమహర్షులవారు. "అహం బ్రహ్మాస్మి", "తత్త్వమసి", "అయమాత్మా బ్రహ్మ", "ప్రజ్ఞానం బ్రహ్మ" – అన్న వేదోక్త మహావాక్యాలను నిజజీవితంలో నిరూపించిన బ్రహ్మజ్ఞులు వారు.

వారు ప్రబోధించిన జ్ఞానమార్గమైన అద్వైతముతో సమన్వయించడంలో 'మౌనం' మహెూత్కృష్ట సాధనగా ప్రశస్తి గాంచింది.

ఒక శిష్యుడు గురువు చెంతకు వెళ్ళి "మహాత్మా! తాపత్రయాగ్నిచే దహింపబడే నన్ను భవదీయ కరుణాకటాక్ష వీక్షణమనే వర్షముచే చల్లార్చి శాశ్వతానంద మోక్ష సుఖం ప్రసాదించు" అని వేడుకొన్నాడు. ధ్యాననిష్ఠుడై యుండిన గురువు చిత్రపు బొమ్మలాగా ఉండినాడే కాని ప్రత్యుత్తర మీలేదు.

మరల ఆశిష్యుడు "పుణ్య పురుషా! తమ బోటి మహాత్ములు మాత్రం శాశ్వతానందం అనుభవించి మౌనంగా ఉండిన మాబోటి వారెట్లు తరింపగలరు?" అని ప్రశ్నించాడు అప్పుడు గురువు "ప్రియ

సోదరా! నీ ప్రశ్నకు తగిన సమాధానం ఇస్తూనే ఉన్నాను గాని నీవు దానిని తెలుసుకొనజాలకున్నావు" అని మౌనం వీడి విపులంగా సమాధానమిచ్చాడు. మౌనంలోనే సముచిత సమాధానం కలదని దీనినిబట్టి గ్రహించవచ్చు.

ఈ విషయం శ్రీ మలయాళస్వాములవారు 1919లో రచించిన శుష్కవేదాంత తమోభాస్కరమనే గ్రంథంలో విశదంగా చూడవచ్చు.

భగవాన్ శ్రీరమణులవారి అనుయాయులలో ప్రథమ శ్రేణికి చెందినవారు శ్రీ ప్రజ్ఞారణ్య స్వామీజీ. వారు పలు ప్రదేశాలలో శిష్యులకు యోగసాధనలో తగిన శిక్షణ నిచ్చారు. తిరుపతిలోని శ్రీమలయాళ సద్గురు మందిరంలో వారు నిర్వహించిన శిక్షణ తరగతులను చూచి నేను అమందానందం పొందాను.

ఒకసారి హైద్రాబాద్ రామకృష్ణ మఠంలో ఒక వారం దినాలు నేను 'యోగవాసిష్ఠం'పై ప్రసంగించాను. ఆ సభలో పాల్గొన్న శ్రీప్రజ్ఞారణ్య స్వామివారు నన్ను ఎంతగానో అభినందించి ధన్యుణ్ణి కావించారు.

ఈ గ్రంథం రచించిన శ్రీబ్రహ్మవిద్యా చైతన్యగారు పూర్వజన్మలోనే ఆధ్యాత్మిక సంస్కార సంపన్నులు. వారు శ్రీప్రజ్ఞారణ్య స్వామివారి సన్నిధిలో చేరి వారి అనుగ్రహానికి పాత్రులయ్యారు. వారి బోధలను శ్రద్ధాసక్తులతో విని ధన్యులయ్యారు.

'అధ్యాత్మ విద్యా విద్యానాం' - అన్నట్లు విద్యలలో అధ్యాత్మవిద్య మేటి. దాని పట్ల అభిరుచి అందరికీ కలగదు. శ్రీ

బ్రహ్మవిద్యా చైతన్యులవారు గుర్వనుగ్రహం వల్ల ఆ విద్య పట్ల శ్రద్ధ గలవారయ్యారు. వారు కావించిన గురుసేవ వారికి ధన్యత చేకూర్చింది.

గురు శిష్యుల సంభాషణల రూపంలోనే గీతాది ప్రాచీనాధ్యాత్మిక గ్రంథాలు వేదాంత సత్యాలను ప్రకటించాయి. ఈ గ్రంథరచనలో కూడా ఆ సంప్రదాయమే పాటించడం జరిగింది.

వయస్సు పైబడిన తరువాత ఆధ్యాత్మిక దృష్టి కలగవచ్చు. కాని శ్రీ చైతన్యగారికి లేత ప్రాయంలోనే ఆ దృష్టి సిద్ధించింది. అది వారి పూర్వ పుణ్యఫలమే.

ఈ గ్రంథం విస్తృత వ్యాప్తి పొంది బ్రహ్మ విద్యకు తగిన వ్యాప్తి కలిగించుగాక

గ్రంథకర్తతోపాటు దీని ముద్రణలో శ్రద్ధ చూపిన శ్రీ ఆదిత్య శర్మ గారు అభినందనీయులు.

ప్రజ్ఞారణ్య గురో శ్శిష్యః
బ్రహ్మవిద్యా విశారదః ।
శ్రీ బ్రహ్మవిద్యా చైతన్యః
బ్రహ్మజ్ఞఃసన్ విరాజతామ్ ॥

– సముద్రాల లక్ష్మణయ్య

క్యాంప్–హైద్రాబాద్ 14–3–2022

ప్రశంస

బ్రహ్మ విద్యా చైతన్య - ఏడడుగుల వివాహ బంధాన్ని పరిత్యజించి, ప్రజ్ఞారణ్య స్వామితో "ప్రజ్ఞా-బంధాన్ని" బలపరచుకొన్న గొప్ప ఆధ్యాత్మిక విప్లవ వీరుడు. ఆ క్రమంలోనే కేవలం రోజుకు 1 లీటరు పాలను మాత్రమే ఆహారంగా తీసుకొంటూ, ఏకధాటిగా 10-12 గంటలు ధ్యాన సాధన చేయు తీవ్ర జిజ్ఞాసువు, అటువంటి చైతన్యను గురించి అతి సామాన్యుడైన నేనేమి ప్రశంసించగలను. అయినా గురుకృపతో నాకు గల సన్నిహిత, సాన్నిహిత్యాన్ని పురస్కరించుకొని నాలుగు మాటలు వ్రాయుచున్నాను.

గ్రంథాన్ని శ్రద్ధతో ఆమూలాగ్రము చదివినాను. వాల్మీకి, వేద వ్యాసులు మరియు పోతన మొదలగు వారు స్వానుభవ పూర్వకంగా రచించిన, గ్రంథాలు ఇప్పటికి అమృతప్రాయంగా నిలిచిపోయినవి. అదే విధానంలో చైతన్యగారు గ్రంథ రచన జేసి ధన్యుడయ్యాడు. లోతైన ఆధ్యాత్మిక విషయాలను సంభాషణా శైలిలో అతి సులభంగా అందించారు. గురు శిష్యుల సంభాషణా శైలి మృధు మధురంగా ఉంది. అందులో బాహ్య-అంతరార్థాలతో అసలు సిసలైన "నేను" గారిని వివరించిన విధానము అత్యద్భుతము. పాఠకులలో గొప్ప ఆధ్యాత్మిక చైతన్యాన్ని ఇది తప్పనిసరిగా తీసుకొనిరాగలదు. ఆ సద్గురు కృప అందరిపై సదా ఉండుగాక!

శ్రీ సద్గురు కృపకు తార్కాణంగా నేను కొన్ని స్వవిషయాలను పాఠక మహాశయుల ముందుంచుచున్నాను. 1970 సంవత్సరములో జాతీయ ఉత్తమ ట్రయినీగా, ఇండియన్ ఎయిర్ ఫోర్సులో అవార్డు రావడం. 1971 సంవత్సరములో జరిగిన ఇండో-పాక్ యుద్ధంలో 5 పథకాలను పొందడం. 1975 సంవత్సరములో న్యూఢిల్లీలో

స్వామి చిన్మయానందతో పరిచయము గల్గడం చిన్మయానంద మిషన్ ద్వారా 6 నెలలు గీతా, ఉపనిషత్‌ల అధ్యయనం లభించడం నా జీవితములో మరపురాని దివ్య సంఘటనలు. ఎయిర్ ఫోర్స్ నుండి 1985 సం.లో స్వచ్ఛంద పదవీ విరమణ పొందడం రాష్ట్ర బి.సి. వెల్‌ఫేర్ విభాగములో వెల్‌ఫేర్ ఆఫీసరుగా, హాస్టల్స్ నిర్వహణలో అనూహ్య మార్పులు, అధికారుల అండగా చేయగల్గడం ఉత్తమ అవార్డు లెన్నో పొందడం నిజంగా గురు కృపయే.

తర్వాత ఒక శుభముహూర్తాన బుచ్చిరెడ్డిపాళెంలో పూజ్యశ్రీ ప్రజ్ఞారణ్యస్వామి గారితో గట్టి ప్రజ్ఞా బంధం ద్వారా ఒకటైనాము. అప్పటి నుండి స్వామి శరీర పరిత్యాగము చేయు వఅకు గూడ ఎన్నో ఆధ్యాత్మిక, ఆంతరంగిక కార్యక్రమాలను చేయు పరమ భాగ్యము నాకు లభించినది. ఎన్నో పాఠశాలల్లో, కళాశాలల్లో ఆధ్యాత్మిక తరగతులను, కార్యక్రమాలను స్వామితో కలసి చేయడం జరిగింది. బ్రహ్మవిద్యా చైతన్య యొక్క సాధనను జూచి స్వామి వారు ఎంతో సంతసించెడి వారు. స్వామి వారి యొక్క ఆశయాలను, సాధనా పద్ధతులను చైతన్య గారు సమర్థవంతంగా నిర్వహించు చున్నారు. ఆక్రమంలోనే **"ప్రజ్ఞా బంధం – నా గురు దేవులతో"** అను గ్రంథాన్ని వారు రచించారు. ఈ గ్రంథాన్ని అందరూ చదివి శ్రీ సద్గురు దేవుల కృపకు పాత్రులు కావాలని గురు దేవుల దివ్య పాద పద్మములకు ప్రణమిల్లుచున్నాను.

ఇట్లు
శ్రీ సద్గురు సేవలో
కామసాని కృష్ణా రెడ్డి B.A.,B.Ed.,
(Ex.IAF)

ఓం అరుణాచలేశ్వరాయ నమః

కరుణించిన ప్రత్యక్ష దైవం

అడగకుండానే అన్ని ఇచ్చువాడు భగవంతుడని అంటారు. ఈ వాక్యాన్ని నిరూపిస్తూ నన్ను కరుణించి తమ పాదాల చెంతకు చేర్చుకుని అడగకనే సకలము ప్రసాదించి నా హృదయమున నిలచి అన్ని వేళలా నాకు మార్గోపదేశం చేయుచున్న నా గురుదేవులు పూజ్యశ్రీ స్వామి ప్రజ్ఞారణ్య మహారాజ్ యొక్క ఉత్కృష్ట యోగ స్థితి అయిన ఆ సచ్చిదానంద పరబ్రహ్మ స్థితిని తెలియజేస్తూ కింద తెలుపబడిన

1. జ్ఞాని శరీరముతో ఉన్నప్పటికి తన సహజ ఆత్మ స్థితిలో ఉ ంటాడు, నిద్ర కాని నిద్ర లో ఉంటాడు. అయినా శరీరంతో చేసే వ్యవహారం (కర్మ) కానీ, ధ్యాన నిష్ఠ కానీ, నిద్ర కానీ వీటిలో ఏ ఒక్కటి అతనికి తెలియదు.

2. తురీయాన్ని 'ఎప్పుడూ మేల్కొనక నిద్రించే మహా నిద్ర' అని అన్నా లేదా 'నిద్ర లేని కేవల నిత్య జాగ్రత్' అని అన్నా కూడా ఒకటే.

3. చిత్తశాంతి కలిగిన బ్రహ్మ విద్వరిష్ఠుడు ఇంద్రియములను నిగ్రహించి బాలునివలెను, పిచ్చివాని వలెను, పిశాచము వలెను, నిద్రించు వాని రీతిగాను జగమును మరచి ఉండును. (సీతారామాంజనేయ సంవాదము).

4. ఆత్మానుభవం పొందినవారే ఆ సుఖాన్ని అనుభవించగలరు. కానీ వారు దేహాత్మ బుద్ధి నశించి ఆ ఆనందాతీత మౌనాన్ని సాధించిన విధానం ఏమిటో వారికి తెలియదు.
5. అద్వితీయ పరతత్త్వమైన ఆత్మ స్వరూపాన్ని ఎడతెరిపి లేకుండా ఏకాగ్రతతో అవలోకించడమే పరమోత్తమ శుద్ధమౌనము.
6. ప్రశ్నలు, జవాబులు అన్నీ కూడా ద్వైత భాషలోనే, అద్వైత భాష అయిన మౌనరూపంలో అవి లేవు. మౌనం అనే అద్వైత భాషలో అవి ఉండవు.
7. గురుశిష్యుల మధ్య జ్ఞాన విషయ బోధన ఇద్దరి మధ్య సంవాదం రూపంలో జరుగుతుంది. ఏ స్థితిలో ఉంటే ఇద్దరి మనసులు ఏకమవుతాయో ఆ మనసులేని మౌన స్థితిలో ఉండటమే ఉత్తమమైన సంవాదము.
8. ఋషులు దర్శించిన సకల వేద ఆగమ సిద్ధాంతాల సారమైన సత్యము, అనుష్ఠించవలసిన సదాచారము ఏదంటే మౌనమనే పరమ శాంత స్థితి.

ఇటువంటి వాక్యములే కాక మరికొన్ని శాస్త్ర వాక్యాలకు నిదర్శనంగా నిలిచిన అట్టి ఉత్కృష్ట యోగ స్థితిలో మేము తరించుటకు వీలుగా గురువు గారు ఉపదేశించిన సందర్భాలను, వారి ఉపదేశాలను ఒకే చోట స్మరించుకోవడానికి వీలుగా నేను గురువు గారితో ఉన్నటువంటి ఆధ్యాత్మిక క్షణాలను కొన్నింటిని ఈ పుస్తకంలో రాసుకోవడం జరుగుతున్నది.

పూజ్యశ్రీ ప్రజ్ఞారణ్య స్వామి పాద సేవకుడు

బ్రహ్మ విద్యా చైతన్య.

ఓం శ్రీ గురుభ్యోనమః

ప్రజ్ఞాబంధం

నాగురుదేవులతో...

దుర్లభం త్రయమేవైతద్దేవానుగ్రహహేతుకమ్
మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుష సంశ్రయః

-మానవుడు అగుట, మోక్షాపేక్ష కలవాడగుట, మహాపురుషుల ఆశ్రయము ప్రాప్తించుట అను ఈ మూడు విషయములును కడు దుర్లభమైనవి. ఇవి దైవానుగ్రహము కారణముగానే ప్రాప్తించునట్టివి.

(వివేక చూడామణి)

అని ఆదిశంకరాచార్యుల వివేక చూడామణి చెప్పుచున్నది. ఆ దైవం నాపైన అపారమైన కృప చూపి నాకు ఇంతటి దుర్లభమైన జీవితాన్ని ప్రసాదించింది. పైన చెప్పిన మూడు విషయాలు అనుకూలించి నప్పటికి తల్లిదండ్రులు అనుమతించకపోతే గురువులు కూడా వారి అభిప్రాయాన్ని కాదనరు. కానీ నా విషయంలో దైవం తల్లిదండ్రుల రూపంలో కూడా సహాయం చేసింది. గురువు గారికి ఈ విషయం చాలా సంతోషాన్ని కలిగించింది.

నేను చదువుకునే రోజుల్లో రామకృష్ణ ప్రభలో ఒక విషయాన్ని చదివాను. అందులో ఒక ఉదాహరణ ద్వారా భగవంతుని మనం ఏమి అడక్కపోతే మనకు ఏమి కావాలో దానిని భగవంతుడే ప్రసాదిస్తాడు. అప్పుడు దానిని స్వీకరించడానికి నీ చేతులు సరిపోవు

అన్నట్లు వివరించారు. అప్పటి నుండి నేను ఏ దైవ దర్శనానికి వెళ్ళినా కూడా భగవంతుని ఏమి అడగను. తరువాత తిరుపతిలో నా ఆధ్యాత్మిక జీవితంలో భాగంగా ఆ తిరుమలేశునికి సేవ చేసుకునే భాగ్యం కలిగింది. అన్ని బ్రహ్మోత్సవాలలో పాల్గొనే అవకాశం కలిగింది. ఆ విధమైన వారి సేవలకు ప్రతిఫలంగా ఆ దైవమే నన్ను గురువుగారి పాదాలచెంతకు పంపిందని భావిస్తాను.

2015లో నేను స్వయంగా నేర్చుకున్న యోగసాధన ద్వారా ఒక యోగా మాస్టర్ తో కలిసి క్లాసులు నిర్వహించడం జరిగేది. అప్పుడే నేను గురువు గారి గురించి, వారి సప్తాహాల గురించి విని క్లాసులు చేయాలని రెండు సార్లు ప్రయత్నించాను కానీ వీలు కాలేదు, తరువాత 2016 జూన్ నెల బెంగళూరులో గురువుగారి సప్తాహం జరుగుతుందని తెలిసి ఎలాగైనా సప్తాహానికి హాజరు కావాలనుకున్నాను. అక్కడ క్లాసు ఇంగ్లీషులో ఉంటుందని తెలిసింది. అప్పటికి నాకు ఇంగ్లీషు అంతగా అర్థం కాకపోయినా క్లాస్ చేయాలని నిర్ణయించుకుని మొదటిసారి గురువుగారి సప్తాహం బెంగళూరులో చేయడం జరిగింది. ఆ క్లాసులో నేను గురువుగారి ముందే కూర్చునేవాడిని.

ఒకసారి గురువుగారు నన్ను పిలిచి, ఏమయ్యా నువ్వు మూడుగంటలు చక్కగా కూర్చుంటున్నావు, నువ్వు ఇప్పుడే మూడు గంటలు కూర్చుంటున్నావంటే ఆశ్రమానికి వస్తే 6 గంటలు సులభంగా కూర్చోగలవు. ఒకసారి ఆశ్రమానికి వస్తే అక్కడ నీకు ఆశ్రమం అంటే ఏమిటో తెలుస్తుంది, నీ సంగతి ఏమిటో మాకు తెలుస్తుంది అని చెప్పి నాపై అనుగ్రహ వర్షాన్ని కురిపించారు.

ఆ తర్వాత నేను జూలైలో ఆశ్రమంలో సప్తాహం జరుగుతుందని తెలిసి తగిన ఏర్పాట్లు చేసుకుని, సప్తాహానికి హాజరు కావడం జరిగింది. ఆశ్రమంలో సప్తాహం తెలుగులో చెప్పడం జరిగింది. విషయం చాలా చక్కగా అర్థం అవుతుంది. సప్తాహ ఉపన్యాసం లోభాగంగా ఒకరోజు గురువుగారు గౌతమ బుద్ధుని చరిత్ర చెప్పడం జరిగింది. అది అంతకు ముందు విన్నప్పటికి ఆరోజు గురువు గారు గౌతమ బుద్ధుని చరిత్ర లో అతనికి కలిగిన వైరాగ్యం, రాజ్యాన్ని వదిలి పోవడం, ఈ శరీరం ఏమైపోయినా సరే ఇక్కడ నుండి కదలను అని వారం రోజులు ధ్యానంలో నిమగ్నం కావడం వివరించి, ఈ రోజుల్లో ఎవరైనా ఉన్నారా? అలాంటివారు! అన్నారు. అప్పుడు నేను వారి పాదాల దగ్గర కూర్చొని ఉన్నాను. ఈ విషయం నన్ను అనుగ్రహించడానికే అన్నట్లు నా హృదయాన్ని నేరుగా తాకింది. వెంటనే మనసులోనే నేనున్నాను స్వామి అని చెప్పిన స్ఫురణ కలిగినది. సప్తాహం చివరి రోజు గురువు గారితో స్వామి నేను వారం రోజుల తర్వాత మళ్లీ వస్తాను, నేను ఇక్కడే ఉంటానని చెప్పాను. గురువుగారు అందుకు అంగీకరించిన సంతోషంతో తిరిగి తిరుపతికి వెళ్ళిన తర్వాత అమ్మానాన్నలకు ఈ విషయం చెప్పి, నేను ఇక వారం రోజులు మాత్రమే మీతో ఉంటానని, తర్వాత ఆశ్రమానికి వెళుతున్నానని చెప్పాను. నా మాటలు వారికి ఆశ్చర్యంగానూ, వింతగానూ తోచాయి. సుదీర్ఘ చర్చ తరువాత వారు మొదట బాధ పడినప్పటికీ గురువు గారి దయవల్ల ఆశ్రమానికి వెళ్ళటానికి అంగీకరించారు.

నేను వారం రోజుల్లో అక్కడి వ్యవహారమంతా చక్కదిద్దుకుని సరిగ్గా వారానికి బయలుదేరే ముందు ఇంట్లో మా అమ్మగారు మాత్రమే ఉన్నారు. నేను బయలుదేరుతానన్న విషయం చెప్పగా బాధతో ఇలా

అన్నారు. నువ్వు పుట్టిన సమయం తెలిసి ఎవరో అన్నారు. కార్తిక సోమవారం, మూడవ వారం, తెల్లవారుజామున పుట్టాడు అదృష్టవంతులు అని అంటే ఏమో అనుకున్నాను. కానీ ఈ విధంగా మమ్మల్ని వదలిపెట్టి పోయే అదృష్టం పడుతుందనుకోలేదు అన్నారు. తరువాత మా నాన్నగారు పనిచేస్తున్న చోటికి వెళ్లి వారి ఆశీర్వాదం, అనుమతి తీసుకుని ఆశ్రమానికి ఆగస్టు 10వ తేదీన తిరిగి రావడం జరిగింది. ఆవిధంగా సరిగ్గా 25 సంవత్సరాల వయసులో గురువుగారి పాదాల చెంత చేరడం జరిగింది.

గురువుగారితో ఒకసారి మా అమ్మగారు నాతో అన్న ఈ విషయాన్ని చెప్పగా అదృష్టం అంటే ఏమిటో తర్వాత తెలుస్తుందిలే వారికి అన్నారు. ఆవిధంగా సద్గురువులైన గురువుగారి అనుగ్రహ ప్రసాదము లభించింది.

ఒకరోజు గురువుగారు గది బయట కూర్చుని ఉండగా వారి దగ్గరికి వెళ్ళి నమస్కరించి కూర్చున్నాను.

గురువు యొక్క ఆవశ్యకతను తెలుపుతూ మొదటి ఉపదేశంగా ఈ **స్త్రీల విషయంలో, డబ్బు విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి**. అందుకే గురువు అవసరం అంటారు అని సెలవిచ్చారు.

గురువు గారి అనుగ్రహ దృష్టి వలన వారు సూచించిన సాధనా పద్ధతులు అన్నింటిలో మంచి ఫలితం లభించేది. గురువుగారు ప్రత్యక్షంగా పరిశీలిస్తూ సాధన చేయించేవారు.

ఆగస్టు 25,2016 న కృష్ణాష్టమి సందర్భంగా గురువుగారు నాకు బ్రహ్మచారి నామాన్ని ఇస్తూ **"బ్రహ్మ చైతన్య"** అను పేరుతో పిలవడం

జరిగింది. తరువాత ఆ పేరును **బ్రహ్మవిద్యా చైతన్య** గా మార్చి గురువుగారిలాగానే ఏక వస్త్రాన్ని ధరించమని సెలవిచ్చారు.

ప్రతిరోజు ఉదయం 3గంటలకు ధ్యానమందిరం వెళ్లడం జరుగుతుంది. ఆ సమయంలో గురువుగారిని అనుసరించి మేమంతా వెళ్లడం జరుగుతుంది. గురువుగారు ధ్యానమందిరంలో పూజ చేసిన తర్వాత ధ్యానానికి కూర్చునే ముందు కొంత సత్సంగం జరిగేది. ఆ సమయంలో గురువుగారు చెప్పే విషయాలు ఎంతో మానసిక పరిపక్వతను కలిగించి అంతర్ముఖ సాధనకు సహకరించేవి.

సెప్టెంబర్ 8, 2016 న గురువు గారు ఇలా సెలవిచ్చారు.

ఒక వస్తువును చూపిస్తూ అక్కడ చూడండి, అక్కడ అది ఉన్నది. అది ఉన్నదని మనకు తెలుస్తుంది. ఎలా తెలుస్తుంది? నా (ఆత్మ శక్తి) వల్ల తెలుస్తున్నది. నువ్వు ఉన్నావా అంటే ఎవరైనా ఉన్నాను అని గట్టిగా చెప్తారు. ఎలా తెలుసు అంటే సమాధానం ఉండదు. ఎక్కడ ఉన్నావు? అంటే ఇక్కడే ఉన్నాను అంటాడు. ఈ శరీరమే నేను అనుకుంటారు. ఆత్మ యొక్క ఎరుకను కనుగొనుట ఎవరికి తెలియడం లేదు. ఎరుకలో ఉన్న సుఖము ఎక్కడా లేదన్న వేమన బోధ తెలుపుతూ అంతటా ఉన్న నిన్ను నువ్వు తెలుసుకో, నువ్వు ఎక్కడ ఉన్నావు? అంటే అంతటా ఉన్నాను అని చెప్పగలిగే భావన వచ్చినప్పుడు ఇక వారు వెనక్కు చూడాల్సిన అవసరం లేదు. వారిలో ఉన్న నేను మాత్రమే చూడగలరని చెప్పారు.

వస్తువు ఉనికి దానికి తెలియదు. అలాగే శరీరం ఒకటున్నదని శరీరానికి తెలియదు. వాటి ఉనికి నా (ఆత్మశక్తి) వలన తెలుస్తున్నది. కనుక నేను (బ్రహ్మ) మాత్రమే సత్యము జగత్తు అసత్యం. బ్రహ్మసత్యం జగన్మిథ్య'

"బ్రహ్మ హత్య చేయడం అంటే నీలో ఉన్న బ్రహ్మను గుర్తించక ఈ శరీరాన్ని పట్టుకోవడమే బ్రహ్మ హత్య చేయడం అని చెప్పారు."

రోజులో (6+6) 12 గంటలు సాధన చేసే స్థాయికి చేరుకుంటే పుస్తకాలు చదివే అవసరం లేదని చెప్పారు.

సెప్టెంబరు 9, 2016.

నేను అంతటా ఉన్నాను. శరీరంలో ప్రతి కణంలో లీనమై ఉన్నాను. నా వల్లనే అన్ని పనులు జరుగుతున్నాయని నేను అంతటా ఉన్నాను అన్న విషయం సీతారాములు ఆంజనేయునితో చెప్పిన సందర్భాన్ని వివరించారు. కుక్క వాసన చూసి యజమానిని గుర్తించి ఎలా వెళ్తుందో అలా బ్రహ్మాన్ని గుర్తించాలని చెప్పారు.

ప్రజ్ఞా ప్రత్యవీక్షణ మూడు నెలలు సరిగ్గా చేస్తే కొన్ని శక్తులు వస్తాయని దాని ఫలితాన్ని గుర్తించవచ్చని చెప్పారు.

'నేను తప్ప అన్యమేదియును లేదు'.

సెప్టెంబరు 11, 2016.

అంతటా ఉన్న నేను గారిని తెలుసుకునే స్వభావాన్ని మర్చిపోయి, ఇక్కడ మనలోనే దగ్గరగా ఉన్న ఆత్మను గుర్తించక అన్ని చోట్లా తీర్థయాత్రలు చేసి చివరికి ఎవరో ఒకరి ద్వారా తెలుసుకుని ఇక్కడికే వస్తారని చెప్పారు. దానికి ఉదాహరణగా గురువు గారి జీవితంలో జరిగిన ఒక సంఘటనను చెప్పారు. గురువు గారిని కలవడానికి వచ్చిన ఒక భక్తురాలు నాలుగు రోజులు గురువు గారి కోసం వెతుకుతూ, చివరకు గురువు గారి దగ్గరకు వెళ్లి ఇలా అడిగారట. స్వామి ఇక్కడ ఋషికేశ్ స్వామి ఎవరు? ఎక్కడ ఉన్నారు? వారిని

నేను కలవాలి అని. అప్పుడు గురువు గారు నేనే వారిని అని చెప్పగా అవునా! మీరేనా! ఆ స్వామి మిమ్మల్ని నేను రోజు చూస్తున్నాను, ఇదే దారిలో వెళ్తున్నాను. కానీ మీరే ఆస్వామి అని నాకు తెలియదు అన్నారట. మాయా ప్రభావం వల్ల మనం తెలుసుకోవలసినది మనకు అత్యంత సమీపంలో ఉన్నా తెలుసుకోలేక పోతున్నామని, ఒక మంచి కార్యాన్ని మొదలుపెట్టి మధ్యలో అనవసరమైన విషయానికై దానిని విడుచుట మాయా ప్రభావం అని చెప్పారు. తనను తాను తెలుసుకోవడమే అసలైన ధర్మమని దానిని విస్మరించి మధ్యలో తల్లి, తండ్రి, భార్య బిడ్డలను పోషించడం, ధనాన్ని ఆర్జించి సేవ చేయటం పురుష ధర్మం అని చెప్తూ దానిని పట్టుకుని అసలు దానిని వదిలి పెడుతున్నారని చెప్పారు. గాఢనిద్రలో ఉన్న వ్యక్తికి బాహ్య ప్రపంచం తెలియదు అతను నిద్రలేచి ఏమీ తెలియలేదు అని చెప్తాడు. కానీ ఏమీ తెలియలేదు అని చెప్పిన ఒక తెలివి ఉన్నదని, అదే నేను అన్న విషయం అతడు గుర్తించలేక ఉన్నాడని చెప్పారు.

అక్టోబర్ 19, 2016.

ప్రతి దేవుని పూజించే పద్ధతిలో స్వామిని పిలిచే పద్ధతి పేరు సచ్చిదానంద స్వరూప అని స్తోత్రాలు చెప్తారు. కనుక అన్నింటి స్వరూపం సచ్చిదానందం అని చెప్పారు. కొందరు దీపాన్ని సచ్చిదానందంగా కృష్ణుడుగా భావించి పూజిస్తారు. ఏది ఏమైనా ఓంకారం చేస్తూ మరణిస్తే బ్రహ్మలోకం చేరుతారు అని ఒక వ్యక్తికి రమణ మహర్షి సన్నిధిలో అలా జరిగిందని చెప్పారు. సచ్చిదానంద పరమాత్మ ఒక్కటే సర్వాంతర్యామి, అంతటా వ్యాపించి ఉన్నదని చెప్పారు.

ఒకసారి చెన్నై నుంచి కొందరు భక్తులు వచ్చి గురువుగారి ఉపదేశాన్ని వీడియో రికార్డ్ చేసే పద్ధతి చూసి తర్వాత వారితో కెమెరాకు మైకు ఎలా అమర్చారు అని అడిగాను. దానిని ఆడియో స్పష్టత కోసం అమర్చారు. అందుకు వారు అలాంటిదే నేను వెళ్ళిన తర్వాత పంపిస్తామన్నారు. తర్వాత రోజు ఉదయం ఈ విషయాన్ని వైజయంతి మాత, గురువు గారితో వారు కేబుల్ తో సహా మైక్ పంపిస్తామన్నారు స్వామి అని చెప్పారు. అప్పుడు గురువుగారు నా వైపు చూసి నువ్వు అడిగావా? అన్నారు. నేను లేదు స్వామి అది ఎలా కనెక్ట్ చేస్తారని మాత్రమే అడిగానని చెప్పాను. అప్పుడు గురువవు గారు నాతో అయినా సరే

'ఎప్పుడూ, ఎవరినీ, ఏమీ అడగకు నీకు కావలసినది నీ దగ్గరికే వస్తుంది' అని ఉపదేశించారు.

ఒకసారి నేను మా ఊరు వెళ్లవలసి వచ్చినది. అందుకు గురువుగారు అనుమతించారు. అప్పుడు గురువుగారు నా దగ్గర అంతకు ముందు ఇచ్చిన కెమెరాతో ఆశ్రమాన్ని వీడియో తీశాను. ఆ తర్వాత దీనిని తీసుకెళ్ళి వాళ్లకు ఆశ్రమం చూపిస్తే బాగుంటుందని అనుకున్నాను. కెమెరా గదిలో పెట్టి గురువుగారికి చెప్పి బయలుదేరదామని వారి దగ్గరికి వెళ్ళగానే గురువుగారు నీ దగ్గర కెమెరా తీసుకెళ్ళి ఈ ఆశ్రమం వాళ్ళకు చూపించు, అలాగే వాళ్లను కూడా వీడియో తీసి వచ్చిన తర్వాత మాకు చూపించు అని నేను చెప్పకనే నా మనసులోని విషయాన్ని గ్రహించి వారు ఆ విధంగా చెప్పడం జరిగింది. వెంటనే నేను ఆశ్చర్యంతో అలాగే స్వామి అని చెప్పి బయలుదేరాను. ఇలాంటి సందర్భాలు తర్వాత ఎన్నో జరిగాయి. ఊరు నుండి తిరిగి వచ్చిన

తర్వాత ఒకసారి గురువుగారు ఒక సంవత్సరం ఉండాలయ్యా ఆ తర్వాత ఎప్పుడైనా వెళ్లాలనుకుంటే నువ్వు వెళ్ళవచ్చు, వారూ రావచ్చు అన్నారు. ఆ తరువాత సంవత్సరం కాలం పాటు ఆశ్రమ కార్యక్రమాలు యధావిధిగా గురువుగారి సన్నిధిలో జరిగేవి. గురువుగారు సూచించిన సాధన పద్ధతులను మాతో చేయించేవారు. ఆ సాధనా పద్ధతులలో ప్రణవ నాద అనుసంధానం లేదా ఓంకార సాధన మామూలుగా 30 సెకన్ల కంటే ఎక్కువగా ఉచ్చరించడం జరగదని చెప్పేవారు. కానీ నేను చేసే ఓంకార సాధన వారు ప్రతి రోజు గమనించేవారు. ఆ విధంగా ఓంకార ఉచ్ఛారణ 55 సెకండ్లకు వచ్చినట్లు గురువు గారు చెప్పడం జరిగింది. గురువుగారి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగమైన సాధన సప్తాహాలే కాక ఊహాశక్తి ద్వారా పిల్లల్లో అవగాహన తీసుకురావాలని, తద్వారా నెమ్మదిగా వారికి నేను గురించి, సచ్చిదానందం గురించి తెలియజేయాలి అనుకునేవారు. గురువు గారు, మేము అందుకు సంబంధించిన కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నాము. అయితే తర్వాత జరగబోయే పరిణామాలకి సూచన ఇది అన్నట్లు అప్పుడప్పుడు గురువు గారు మాతో ఇలా అనేవారు 'ఏమండి అంతా వదిలిపెట్టి బ్రహ్మంలో కలిసిపోదామని అనుకుంటున్నానండి' అని చాలా సందర్భాల్లో చెప్పేవారు. తర్వాత గురువుగారి మాటల్లోనే ఈ విషయం స్పష్టమవుతుంది. ఇక మీదట జరిగిన సన్నివేశాలు గురువుగారి ఆధ్యాత్మిక ఉన్నతిని ఉత్కృష్ట యోగ స్థితిని తెలియచేయుచున్నవి.

గురువుగారు అక్టోబర్ 2017న హైదరాబాద్ లో సప్తాహం తరగతులు నిర్వహించడానికి వెళ్లారు. కానీ వారికి కలిగిన అనారోగ్య

పరిస్థితి కారణంగా సప్తాహము వారం రోజుల కంటే ముందుగా ముగించి ఆశ్రమానికి వచ్చారు. గురువు గారు ఇంతకు ముందే (ప్రోస్టేట్) యూరిన్ సంబంధవ్యాధికి మందులు వాడేవారు. సహజంగా వారికి మందులు వేసుకోవటం ఇష్టం ఉండదు. కనుక ఆ వారం వారు మందులు వాడ లేదని తెలిసింది. అంతకుముందు కూడా సమయానికి గుర్తు చేసి మాతాజీ గారే మందులు ఇచ్చేవారు. హైదరాబాద్ నుండి ఆశ్రమానికి వచ్చిన తరువాత కూడా గురువు గారు అంతకు ముందు చెప్పిన విధంగానే దీనిని అంతా వదిలేస్తామని బ్రహ్మంలో కలిసిపోతామని అనేవారు. ఒకరోజు గురువుగారు నన్ను పిలిచి రేపు మనం నెల్లూరు వెళ్తాము డాక్టర్ గారికి మందులు ఇక మీదట వేసుకోనని బ్రహ్మంలో కలిసి పోతామని చెప్పేస్తామండి అన్నారు. తరువాత రోజు గురువుగారు, నేను కలిసి నెల్లూరు వెళ్ళాము. అక్కడ గురువుగారు మాత్రమే వెళ్లి డాక్టర్ గారిని కలిసి వచ్చిన తర్వాత నాతో ఇలా అన్నారు. డాక్టర్ గారితో చెప్పేశానండి మందులు వేసుకోనని నా దగ్గర ఉన్న మందులు కూడా తిరిగి ఇచ్చేశాను. ఇక ఉంటే ఉంటాం, లేదంటే బ్రహ్మలో కలిసి పోతాం అని చెప్పానన్నారు. మరుసటిరోజు గురువుగారు జ్వరంతో ఉన్నప్పటికి యధావిధిగా ఉదయం 3గంటలకు ధ్యానమందిరానికి వచ్చారు. ఆ రోజు సాయంత్రం జ్వరం ఎక్కువగా ఉన్నట్లు తెలిసి బుచ్చినుంచి డాక్టర్ రాజు గారు వచ్చి చికిత్స చేసి వెళ్ళారు. ఆ రోజుకి కొంత తగ్గినట్లు ఉన్నా తర్వాత రోజు అది అధికమైనది. ఆ రోజు రాత్రి మేము గురువు గారి గది బయటే విశ్రమించాము. మరుసటి రోజు (31-10-2017) నెల్లూరు డాక్టర్ మోహన్ రాజు గారితో మాట్లాడి గురువుగారిని హాస్పిటల్

తీసుకెళ్లు చున్నాము. దారిలోనే మూర్ఛ కనిపించింది. వారు అంతా మర్చిపోతున్నట్లు వారి మాటల్లో తెలుస్తుంది. హాస్పిటల్‌కి వెళ్ళిన తర్వాత డాక్టర్ గారు పరిశీలించి యూరిన్ పాస్ కావడం లేదని, ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నదని హైదరాబాద్ తీసుకెళ్ళమని సలహా ఇవ్వడం జరిగింది. అదే విధంగా హైదరాబాద్ తీసుకువెళ్లేందుకు అంబులెన్సు ఏర్పాటు చేసుకుని వెళ్తుండగా దారి మధ్యలో ఫిట్స్ (మూర్ఛ) వస్తున్నట్లు గమనించి వెనక్కి తీసుకురావడం జరిగింది. డాక్టర్ గారి సలహా మేరకు అత్యవసర పరిస్థితిలో నెల్లూరులోని బొల్లినేని హాస్పిటల్ లో చేర్చడం జరిగింది. వారు అన్ని పరీక్షలు చేసి బ్రెయిన్ ఇన్ఫెక్షన్ అని చెప్పి మూడు రోజుల తర్వాత హైదరాబాదుకు తీసుకెళ్లమన్నారు. వారి సలహా మేరకు అంబులెన్స్ లో హైదరాబాద్ తీసుకు వెళ్లడం జరిగింది. హైదరాబాద్‌కు గురువుగారితో పాటు మైఖేల్ గారు, కళామాత మరియు వైజయంతి మాత ముగ్గురు వెళ్లారు. నేను ఆశ్రమానికి వచ్చి ఆశ్రమంలో ఉన్నాను.

ఇప్పటివరకు జరిగిన గురువుగారి అనారోగ్య పరిస్థితి భౌతిక దృష్టితో చూస్తే నిజమే అయినప్పటికీ ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే గురువుగారు ఈ వ్యవహారాన్ని వదిలిపెట్టుటకు కేవలం వారు కల్పించిన, కల్పన అని తరువాత గురువుగారి మాటల్లోనే స్పష్టమవుతున్నది.

గురువుగారిని హైదరాబాద్ తీసుకెళ్లిన రోజు రాత్రి స్వప్నంలో గురువుగారు నాతో మాట్లాడటం జరిగింది. హాస్పిటల్లో స్పృహ లేక నిద్రిస్తున్న గురువుగారి దగ్గరకు నేను వెళ్లి స్వామీజీ, స్వామీజీ అని వారి చేయి పట్టుకొని పిలిచాను. అప్పుడు గురువుగారు నెమ్మదిగా

కళ్ళు తెరిచి ఎవరు అని నా వైపు చూశారు. నేను బ్రహ్మ చైతన్య స్వామీజీ అంటే అందుకు సమాధానంగా నీవు బ్రహ్మ చైతన్య కాదు **'ఎప్పుడూ అంతటా ఉన్నటువంటి సచ్చిదానందం'** అని గుర్తు పెట్టుకో అన్నారు. వారు పడుకొని ఉన్న మంచం పక్కనే నేను స్టూలుపై కూర్చుని ఉండగా గురువుగారు నేను ధరించిన ఏక వస్త్రం ఒక చివర పట్టుకుని నువ్వు ఇక్కడే ఉండు నాకు నిద్ర వస్తున్నది ఏం జరిగిందో తర్వాత చెప్పు అని వారు నిద్రకు ఉపక్రమించడం జరిగింది. ఈ స్వప్న వృత్తాంతం వల్ల మరుసటి రోజు వెంటనే కళా మాతకు ఫోన్ చేసి రాత్రి గురువుగారు స్వప్నంలో నాతో మాట్లాడారు అది నిజంగా జరిగితే బాగుంటుంది అని గద్గద స్వరంతో అన్నాను. అందుకు కళా మాత కూడా బాధపడుతూ అవును అన్నారు.

దాదాపు నెల రోజుల తర్వాత అత్యంత క్లిష్ట పరిస్థితి నుండి కోలుకున్న గురువుగారిని తిరిగి నెల్లూరు జయభారత్ హాస్పిటల్‌కు తీసుకువచ్చి తదుపరి చికిత్స కోసం డాక్టర్ల ఆధ్వర్యంలో ఉంచవలసి వచ్చింది. నేను గురువుగారి దగ్గరకు ప్రతిరోజు ఆశ్రమం నుండి వారందరికి కావలసిన పాలు తీసుకుని వెళ్లి వస్తూ ఉండేవాడిని.

గురువుగారి విషయంలో జరిగిన ఈ పరిణామం గురించి మొదటి నుంచి గురువు గారికి చికిత్స చేస్తున్న డాక్టర్ మోహన్ రాజు గారు, వైజయంతిమాతతో అమ్మా! స్వామీజీ ఈ పరిస్థితి కావాలని కల్పించుకున్నారా? లేక సహజంగా జరిగిందా? అని అడిగితే, అందుకు వైజయంతిమాత సమాధానంగా, లేదు సహజంగానే జరిగిందని చెప్పారని వైజయంతి మాత ఎవరితోనో అనడం విన్నాను కానీ డాక్టర్ గారికి వచ్చిన సందేహం ప్రకారం ఇది గురువుగారు

కల్పించిన దేనని గురువు గారి మాటల్లోనే నేను గ్రహించడం జరిగింది. అది ఎలాగంటే జయభారత్ హాస్పిటల్ లో ఉన్నప్పుడు మేము గురువుగారికి సేవ చేస్తున్నప్పుడు అందుకు సహకరించేవారు కాదు. ఒకసారి బలవంతంగా సేవ చేస్తుంటే ఇదంతా ఎందుకండి, ఇది ఎంత అన్యాయం అండి! అంత దూరం వెళ్ళినవారిని వెనక్కి తీసుకువచ్చారు అన్నారు. ఎక్కడికి పోయారు అని కళామాత అంటే భగవంతుని దగ్గరకు అంత దగ్గరగా వెళ్ళిన వాణ్ణి వెనక్కి తీసుకువచ్చారు అన్నారు. మరొకసారి గురువు గారికి ఇష్టం లేకుండా ట్రీట్మెంట్ (చికిత్స) చేసిన తర్వాత నా వైపు చూస్తూ ఇలా అన్నారు.

మేము ఎప్పుడైనా, ఏరకంగానైనా, ఏ జబ్బునైనా తీసుకొని రాగలము ఇది మీకు ఇష్టమేనా? అని. ఈ రెండు సందర్భాలు డాక్టర్ గారికి వచ్చిన సందేహానికి సమాధానమే కాక, గురువుగారు శరీరానికి ప్రాధాన్యతను ఇవ్వక వ్యవహారాలను వదిలిపెట్టి కేవలం సచ్చిదానందంగా ఉండుటకు ఏర్పరుచుకున్న పరిస్థితి అని తెలుస్తున్నది.

ఇప్పటినుంచి తరువాత గురువు గారు చేసిన ఉపదేశం, జీవిత విధానం పూర్తిగా పరమతత్వంతో కూడుకున్నది. వారు కేవలం సచ్చిదానంద పరబ్రహ్మ స్థితిలోనే ఉండేవారు. వారు ఇంతకు ముందు చెప్పినట్లు బ్రహ్మంతో కలిసి బ్రహ్మంగానే ఉంటున్నారు.

ఒకరోజు స్వామీజీ మాతో ఇలా అన్నారు.

నాలుగు ఐదు పద్ధతులు సాధన చేస్తే మీరంతా జ్ఞానులు అయిపోతారని మరియు నావైపు చూస్తూ ఏమయ్యా

"**ఒకే నిష్ఠతో స్థిరంగా కూర్చోవాలి**" అని సెలవిచ్చారు.

డిసెంబరు 18,2017వ తేది నాటి సంభాషణ.

నేను : గురువు గారిని స్వామీజీ, స్వామీజీ అని పిలిచాను.

గురువుగారు : ఇంత మంది స్వాములు ఉన్నారని నేను ఎక్కడా చూడలేదు. నువ్వు ఉన్నావని చెప్పే శాస్త్ర వాక్యాన్ని మాత్రం చూశాను. అని కొంత మౌనం తర్వాత ఇక్కడ ఉంది అన్నారు.

నేను : ఎక్కడ ఉన్నది స్వామి

గురువుగారు : అది మీరు చేసి చూడాలయ్యా అన్నారు.

నేను : అలాగే స్వామీజీ అని మౌనంగా ఉన్నాను.

గురువుగారు : నేను (పరమాత్మ స్వరూపమైన) ఇప్పుడు చూస్తున్నాను అది చూడవచ్చని మీ వల్ల తెలుసుకున్నా అన్నారు.

నేను : మేము (అహంకార రూపమైన) కూడా చూడవచ్చా! స్వామి అంటే

గురువుగారు : నువ్వు (అహంకారరూపమైన) ఉన్నావా! అని వెతుకుతున్నాం ఇక్కడ అన్నారు.

(పై సంభాషణలో జరిగినదంతా సరిగ్గా అర్థం చేసుకున్నట్లయితే కృష్ణుడు చెప్పిన నేను (పరమాత్మ)కు అర్జునుడు చెప్పిన నేను (అహంకార రూపమైనది)కు ఉన్న తేడాను పోల్చవచ్చు.

ఇక్కడ గురువు గారు నేను చూస్తున్నాను, అన్నప్పుడు ఆ 'నేను'అర్థం పరమాత్మగా ఉన్న నేను అని చెప్పవచ్చు. కనుక ఇక్కడ 'చూస్తున్నాను' అన్నప్పుడు అనుమానం లేదు కాబట్టి ఆ చూడటానికి అర్థం అనుమానం లేక ఉన్నాను అని చెప్పవచ్చు. అంటే 'పరమాత్మగా ఉన్నాను' అని అర్థం వస్తుంది.

తర్వాత నేను 'మేము చూడవచ్చా' అన్నప్పుడు మేము అన్న పదం అహంకార రూపమైన శరీరంతో కూడినది గాను, చూడవచ్చా అన్నప్పుడు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది.

కనుక సూర్యుడు చీకటిని వెతుకుతున్నప్పుడు చీకటి కనిపించక తన వెలుగే గోచరించినట్లు.

గురువుగారు కూడా పరమాత్మ స్వరూపంగా పరమాత్మనే చూస్తున్నారు కాబట్టి అహంకార రూపమైన నువ్వు ఉన్నావా! అని వెతుకుతున్నాం ఇక్కడ అన్నారు. అంటే ఆ స్థితిలో వారికి పరమాత్మ తప్ప ఇతరమైనవి గోచరించుట లేదు అని చెప్పవచ్చు).

జనవరి 12, 2018 వ తేదీ గురువుగారు జయభారత్ హాస్పిటల్ నుండి ఆశ్రమానికి రావడం జరిగింది. ఆశ్రమానికి వచ్చిన వెంటనే ధ్యాన మందిరానికి వెళ్లి, అక్కడి నుండి బయటికి వచ్చిన తర్వాత ఆశ్రమాన్ని పరిశీలిస్తూ అంతా తిరిగారు. మేమంతా గురువుగారిని అనుసరిస్తున్నాము. తరువాత గురువు గారి కోసం సిద్ధం చేసి ఉంచిన కృష్ణ మందిరం పైన గదికి వెళ్ళాము. అక్కడ హాలు, గది అంతా చూసి ఆ గది నుంచి అందరూ కిందికి దిగిన తర్వాత నేను ఆ గదితలుపు వేయటం చూసిన గురువుగారు తలుపు వేయవద్దు అక్కడ వారు ఉన్నారు అంటూ, ఎవరినో చూస్తున్నట్లుగా తలుపు తియ్యమని నాతో చెప్పగా నేను తలుపు తీసి కిందికి వచ్చాను. మేమంతా గురువుగారితో ఉంటే మా వైపు చూసి వెళ్ళండి, వారు అక్కడ ఉన్నారు. వారికి మర్యాదలు చేయవద్దా? అని గట్టిగా చెప్పారు. అక్కడ ఎవరూ లేరని మిగతావారు చెబితే మా అందరితో ఇలా అన్నారు. అంతటి మహాత్ములు వారు ఇక్కడికి రావడమే గొప్ప

సంగతి. అలాంటిది వారిని పట్టించుకోకపోతే ఎలా అని అరుస్తున్నారు. మిగతా వారికి ఎవరికీ కనిపించలేదు. గురువుగారు ఈ విధంగా ఎందుకు అంటున్నారా! ఎందుకు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారా! అని, నేను ఆరోజు లోతుగా ఆలోచించాను. అప్పుడు నాకు అర్థమైన విషయం ఏమిటంటే రమణ మహర్షి, యోగి రామయ్య లాంటి మహాత్ములు సూక్ష్మ రూపంలో ఇక్కడ కొలువై ఉండగా వారి సేవలో భాగమైన సాధన కార్యక్రమాలు ఏవి చేయక అందరూ గురువుగారి వెంట తిరగడం వారికి నచ్చలేదని. ఆ రోజే నేను నిర్ణయించుకున్నాను. గురువుగారు సంతోషించే మార్గం సాధన చేయడమేనని, ప్రతి రోజు 12 గంటల పాటు సాధన చేయాలని, ఆ రోజు రాత్రే గురువు గారికి మళ్లీ వ్యాధి లక్షణాలు కనిపించడంలో మరుసటి రోజు హాస్పిటల్‌కి తీసుకెళ్లడం జరిగింది. ఈసారి మాతాజీ వారికి, గురువుగారికి కావలసిన ఆహారం అక్కడే సిద్ధం చేసుకుంటామని మా కోసం ఆశ్రమం నుంచి ప్రతిరోజూ పాలు తీసుకురావద్దని చెప్పారు.

అప్పటి నుంచి నా సాధనకు అనుకూలంగా ఆహారం తీసుకునే సమయాన్ని మార్చుకున్నాను. ఉదయం 3 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు సాధన చేసి తర్వాత పాలు తీసుకోవడం మొదలు పెట్టాను. ఆ విధంగానే నేను 12 గంటల సాధన కొనసాగిస్తున్నాను. కొద్దిరోజుల తర్వాత గురువుగారు, మైఖేల్ గారితో కలిసి ఆశ్రమానికి వచ్చి ఆశ్రమంలో కొంత సేపు ఉండి వెళ్లేవారు. గురువుగారు ఆ విధంగా వచ్చిన మొదటి రెండు రోజులు నేను గురువు గారిని కలవలేదు. ధ్యాన మందిరంలో సాధనలో

ఉన్నాను. మూడవరోజు గురువుగారు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వచ్చారు. ఆరోజు నేను గురువు గారి దగ్గరికి వెళ్లి నమస్కరించి కూర్చున్నాను. గురువుగారు నాతో ఏమయ్యా ఏమిటి సంగతి అన్నారు. నేను గురువు గారితో 12 గంటలు కూర్చుంటున్నాను స్వామి అనగానే గురువుగారు అవును 'తెలుస్తుంది నువ్వు చెప్పకుండానే' అని అన్నారు. ఈ సందర్భమే తెలియజేస్తున్నది గురువుగారు నిరంతరం నాతో ఉండి వారే సాధన చేయిస్తున్నారని.

నేను అప్పుడప్పుడు గురువుగారి దర్శనానికి హాస్పిటల్‌కి వెళ్ళి వచ్చే వాడిని. ఒక రోజు గురువుగారి దగ్గరికి వెళ్లి నమస్కరించి కూర్చున్నాను. గురువుగారు నాతో ఏమయ్యా మీరు గొప్ప సేవ చేస్తున్నారు మనకు కావలసింది అదే అని అనుగ్రహ పూరిత వాక్కులతో అన్నారు. అంతా మీ దయే కదా స్వామి అని నేను గురువు గారికి నమస్కరించాను. మా సంభాషణ అక్కడే ఉన్న రాంప్రసాద్ గారు విని స్వామి నేను ఇప్పటి వరకు కూర్చోలేదు. మీరు అనుగ్రహిస్తే నేను కూడా రోజూ ధ్యానం చేయడం మొదలు పెడతానన్నారు. ఆ విధంగా గురుదేవులు నాపై కరుణతో సాధనలో ముందుకు నడిపిస్తున్నారు.

జూన్ 2017 నుండి గురువుగారు హాస్పిటల్‌కు వెళ్ళే అవసరం లేకుండా ఆశ్రమానికి ఫిజియో తెరఫీ డాక్టర్‌ను పిలుస్తున్నారు. మాతాజీలు ఇద్దరూ గురువుగారి సేవలోనే ఉంటున్నారు.

అప్పటి నుండి గురువుగారు ఉపదేశించే విషయాలు అద్భుతంగానూ, ఎంతో లోతైనవిగాను, ప్రత్యక్షంగా పరమాత్మను చూస్తున్నట్లు వారు అనుభూతి చెందుతూ చెప్పేవారు. నాకు ఎప్పటికప్పుడు గురువు

గారి ఉపదేశాలను రాసి ఉంచాలి అన్న ఆలోచన అప్పుడు లేకపోయింది. జూన్ 2018 నుండి అప్పుడప్పుడు వారు చెప్పే ఉపదేశాలను డైరీలో రాయడం మొదలు పెట్టాను. గురువుగారు నిరంతరం కేవల సచ్చిదానందాన్ని తలుస్తూ అందులోనే ఆనందించేవారు.

అప్పటి నుండి వారు ఎవరినైనా పేరుతో పిలవడం మానేసి అందరిని, అన్నింటిలోనూ బ్రహ్మ స్వరూపంగా ఉన్న బ్రహ్మాన్ని చూస్తూ అలాగే పిలిచేవారు.

ఒకసారి గురువుగారు ఆహారం తీసుకున్న పాల గ్లాసును స్టూలు పై ఉంచారు. కళామాత, గురువు గారి దగ్గరకు రాగానే మాతాజీతో ఆ గ్లాసును చూపిస్తూ ఏమండీ ఆ బ్రహ్మాన్ని అక్కడ నుండి తీసేయండి అన్నారు. ఆ మాట విన్న మాతాజీ గ్లాసు కూడా మీకు బ్రహ్మమేనా అంటూ అక్కడి నుండి గ్లాసును తీశారు.

గురువుగారు ఇంతకు ముందొక సారి చెప్పారు మనం దేనిని అయితే నిరంతరం తలుస్తూ ఉంటామో అదిగా అయిపోతామని, అదేవిధంగా గురువుగారు రమణ మహర్షిని, వారి బోధనలను నిరంతరం తలచి తలచి వారి బోధనలు మాకు చెప్పడం వలన రమణ మహర్షిగా, బ్రహ్మముగా మారిపోయారు. వారు అందరినీ బ్రహ్మమని, రమణ మహర్షి అని పిలిచేవారు.

గురువుగారి పాదాల చెంత మేము తరలించడానికి వీలుగా వారు మాకు ఉపదేశించిన విధానాన్ని నా ఆధ్యాత్మిక దృష్టితో నేను అర్థం చేసుకున్న విషయాలను మననం చేసుకోవటానికి వీలుగా ఇక్కడ

రాసుకోవడం జరుగుతున్నది. అవి గురువుగారి స్వానుభూతికి, వారి ఉత్కృష్ట యోగ స్థితికి నిదర్శనం.

జూన్ 12, 2018 గురువు గారి సందేశం

సత్, చిత్ ఆనందం (EXIST AWARENESS AND BLISS) సచ్చిదానంద పరబ్రహ్మము. ఇది సచ్చిదానందం. అది సచ్చిదానందం. అంతటా ఉన్నది. దానిని మనం అనుభూతి చెందాలి.

'IT IS EVERYWHERE WE FEEL IT'. (ఇవి గురువుగారు అనుభూతి చెందుతూ చెప్పినవి.)

జూన్ 13, 2018 గురువుగారి ఉపదేశం. కొన్ని శబ్దాలు ఉంటాయి తాదాత్మ్యం చెందుటకు వీలు కలిగినవి. సత్సంగం ఎప్పుడూ జరుగుతూంటుంది. అది ఇప్పుడు జరుగుతుంది, ఇప్పుడు జరగదు అనుటకు వీలు లేదు. అది ఉన్నది, ఇక్కడ ఉన్నది, అక్కడా ఉన్నది. ఇక్కడ ఉన్నది, అక్కడలేదు అని చెప్పుటకు వీలు లేదు. (నీ భావనలో) అది ఉన్నదా ఉన్నది, లేదా లేదు. దానికి మొదలు (STARTING), తుది (ENDING) లేదు. ఆకాశం లేదని చెప్పగలమా! అది అంతటా ఉన్నది. ఇది అటువంటిది. ప్రశాంతం ఉన్నది, ప్రశాంతం లేదు ఈ రెండింటి మధ్య తేడా విశాలమైనది. వర్ణనాతీతం, వర్ణించుటకు వీలులేనిది. ఇది ఇలా ఉన్నది అని చెప్పుటకు వీలు లేనిది. (NOT CAPTURE IT) దానిని పట్టుకోలేము. సచ్చిదానంద పరబ్రహ్మ (గురువు గారు అంతర్ముఖులై పలికిన సత్య వాక్కులు.)

ఒకసారి సోలార్ సర్వీస్ విషయమై ఒక వ్యక్తి ఆశ్రమానికి వచ్చి స్వామీ అని పిలిచారు. నేనప్పుడు గురువుగారి దగ్గర కూర్చొని

ఉన్నాను. గురువు గారితో స్వామి ఎవరో వచ్చారు అని చెప్పాను. గురువుగారు బయటికి రావాలి అనుకున్నారు కాని తయారవటానికి కొంత సమయం పట్టింది. అప్పుడు వారు నా వైపు చూసి ఈ లోపు నువ్వు వెళ్లి మాట్లాడు వస్తాను అని ఇదిగో! మనసుతో మాట్లాడు అని సెలవిచ్చారు. తర్వాత దాని అర్థం గ్రహించగా మనసు భాష మౌనం కనుక మౌనంగా ఉండమని సెలవిచ్చారని అర్థం చేసుకున్నాను. మరో సందర్భంలో గురువుగారి ఎదురుగా కూర్చొని ఉన్నాను. అప్పుడు నాతో ఇలా అన్నారు. మౌనంగా ఉండాలి అని చెప్తారు కానీ అది అందరికీ ఇష్టం ఉండదు అని.

జూలై 1, 2018న జరిగిన సందర్భం గురువుగారు (ఫిజికల్) భౌతికంగా వారి శారీరక సేవలకు వీలైనంత వరకు నన్ను దూరంగానే ఉంచారు. ఈ విషయంలో ఆ భాగ్యాన్ని కళా, వైజయంతి మాతలకు ప్రసాదించారని చెప్పవచ్చు.

ఆరోజు గురువుగారు పడుకుని ఉండగా నేను అక్కడే కింద కూర్చుని ఉన్నాను. వారి తలదిండు కొంచెం పక్కకు ఉన్నట్లు గమనించి దాన్ని సరి చేయుటకు వెళ్లాను. గురువుగారు నన్ను చూసి 'నా మనసు కంటే నీ మనసు ఎక్కువగా పని చేస్తున్నది గమ్మునే కూర్చోండి' అన్నారు.

ఆగస్టు 31, 2018 సాయంత్రం నాలుగు గంటలకు గురువు గారి దగ్గరకు వెళ్లాను. వారు విశ్రాంతిలో ఉండటం గమనించి పక్కనే కూర్చుని ఉన్నాను. కొంత సమయానికి కళా మాతాజీ వచ్చి ఆహారం తీసుకోవాలని కోరగా స్వామీజీ పాలు తీసుకొని వెంటనే విశ్రమించారు. నేను అక్కడే కూర్చుని ఉన్నాను. పదినిమిషాల

తర్వాత నా వైపు చూసి ఇలా అన్నారు. చూడు మీరు ఇక్కడ కార్యక్రమాలు చేస్తున్నారు. అక్కడ మీ పేరు ఉన్నది. అంతా పరిశీలిస్తే మీదేమో నిశ్శబ్దంగా ఉండే వ్యవహారం. అది వేరు కానీ ఇదంతా చూస్తే నీకు దానికి ఏదో సంబంధం ఉంది అనుకుంటారు. అని చెప్తూ అది కారు ఉంది కదా దాని గురించి ఆమెకు (అన్నపూర్ణమ్మ) చెప్పాను. ఇక్కడ మన వ్యవహారం వేరే దాని వ్యవహారం వేరే అందుకని వారిని తీసుకువెళ్ళమని చెప్పాను అన్నారు.

సెప్టెంబరు 15, 2018 సాయంత్రం గురువుగారు మంచంపై ఒక చివర విశ్రమించి ఉండటం గమనించిన వైజయంతి మాతాజీ, గురువు గారితో స్వామీజీ అలా జరగండి, అలా జరిగి పడుకోండి అన్నారు. దానికి సమాధానంగా గురువుగారు '**ఎలాగండి జరగడానికి వీలే లేదండి**' అన్నారు. అందుకు మాతాజీ అంత స్థలం ఉన్నది కదా అన్నారు.

(ఇక్కడ గురువు గారు అద్భుతమైన సందేశాన్ని మనకు ఇవ్వటంతో పాటు గురువుగారి యొక్క పూర్ణబ్రహ్మ స్థితిని తెలియచేస్తున్నారు. అంతటా నిండిన బ్రహ్మమే నేనై యుండగా జరుగుటకు స్థలం ఎక్కడ ఉన్నది అది వీలుకాదని గురువుగారి వాస్తవ స్థితి మనకు ఇక్కడ తెలియజేస్తున్నారు.)

సెప్టెంబరు 16, 2018 సత్సంగంలో భాగంగా గురువు గారి సందేశం.

"**నువ్వు ఆత్మస్వరూపం కనుక శరీరాన్ని గురించి విచారించాల్సిన అవసరం లేదు. ఆత్మకు బంధం లేదు**" అని సెలవిచ్చారు. ఇంతలో

కళా మాతాజీ దేనిని గురించో గురువు గారిని అడగగా, ఆత్మ స్వరూపం గురించి మాట్లాడు అన్నారు. అందుకు ఆమె స్వామి మీరు అందులో లీనమై పోయారు అని అన్నారు. అప్పుడు స్వామీజీ ఇలా వచించారు. **"ఆత్మ స్వరూపంలో లీనమై పోవటం కాదు లీనమయ్యే ఉన్నది. అది మాత్రమే ఉన్నది"** అని చెప్పారు. (గురువు గారి అప్పటి ప్రత్యక్ష అనుభూతి వర్ణించుటకు వీలుకానిది). తరువాత కొంత సమయానికి నాతో ఇలా ఉపదేశించారు. '**ఆత్మకు బంధం లేదు, నీవా ఆత్మను తెలుసుకుంటే ఏ గొడవా లేదు. కాబట్టి దానిని ఎరిగి ఉండటమే ఉత్తమం**' అని.

సెప్టెంబర్ 25, 2018 సాయంత్రం నాలుగు గంటలకు గురువుగారి దగ్గర కూర్చొని ఉన్నాను. ఆ సమయంలో గురువు గారు కృష్ణ మందిరంలో ఉన్నారు. కొంత సమయం తర్వాత గురువుగారు కుర్చీలో నుంచి లేచి బయలుదేరారు. నేను గురువుగారిని అనుసరించాను. అది గమనించిన వైజయంతీ మాతాజీ, ఆ విషయము కళా మాతాజీతో చెప్పారు. అప్పుడు వారు గురువుగారి దగ్గరకు వచ్చి స్వామీజీ ఇది మీకు ధర్మం కాదు ఉదయం నుండి సాయంత్రం వరకు మిమ్మల్ని చూసుకునేది మేము మీరు ఇలా చెప్పకుండా సైలెంట్‌గా ఆయన రాగానే వెళ్ళిపోతే ఎలాగా అన్నారు. అందుకు స్వామీజీ నవ్వగా మీరేమో నవ్వుతారు అన్నారు కళామాతాజీ. తర్వాత గురువుగారిని అనుసరించి నేను, కళా మాతాజీ వెళ్ళాము. గురువుగారు ఇంతకు ముందు ఉండే పైన గది బయట కుర్చీలో కూర్చొన్నారు. నేను వారికి ఎదురుగా కింద కూర్చున్నాను. కళామాత పక్కన కుర్చీలో కూర్చున్నారు.

మౌనంగా కొంత సమయం గడిచిన తర్వాత కళా మాత ఎంతసేపు ఉంటారు ఇక్కడ, వాక్ (WALK) చేసే టైంలో వచ్చారు పదినిమిషాలు ఉంటారా? అని గురువుగారిని అడిగితే, చూద్దాం అలాగే అన్నారు గురువుగారు.

కొంత సమయం గురువుగారు కళ్ళు మూసుకుని మౌనంగా ఉన్నారు. నేను కూడా అలాగే మౌనంగా ఉన్నాను.

కళా మాతాజీ : ఏం చేస్తున్నారు నిద్రపోతున్నారా? అని గురువుగారిని ప్రశ్నించారు.

గురువుగారు : లేదు ఆయనతో మాట్లాడుతున్నాను అన్నారు.

కళా మాతాజీ : ఏం మాట్లాడారు ఇంతసేపు అని అడిగారు.

గురువుగారు : ఆయన మౌనంగా మాట్లాడుతున్నారు, నేను మాట్లాడుతున్నాను అన్నారు.

కళా మాతాజీ : ఏం మాట్లాదారు అని మరల అడిగారు.

గురువుగారు : నిశ్శబ్ధంగా అలాగే ఉండు అని చెబుతున్నాను వారితో అన్నారు.

(గురుశిష్యుల మధ్య జ్ఞాన విషయ బోధన ఇద్దరి మధ్య సంవాదం రూపంలో జరుగుతుంది. ఏ స్థితిలో ఉంటే ఇద్దరి మనసులు ఏకమవుతాయో ఆ మనసులేని మౌన స్థితిలో ఉండటమే ఉత్తమమైన సంవాదము). (రమణ మహర్షి).

కళామాతాజీ : నాతో కూడా మాట్లాడారు స్వామి, వాకింగ్ టైం అవుతుంది అంటున్నారు.

గురువు గారు : మరి ఆయన చెప్పినట్టు వినాలి కదా వెళ్తామన్నారు.

మరల

కళామాతాజీ : మామిడి చెట్టు వైపు చూసి స్వామి మామిడి చెట్టు చిగురు వేసింది అయితే వెంటనే కాయలు కాయదు ఎందుకు? అన్నారు.

గురువుగారు : అడిగి చెప్తాను అని మామిడి చెట్టు వైపు చూస్తూ ఏమాయ్యా! ఎందుకు నువ్వు వెంటనే కాయలు కాయవు? చిగురు వచ్చింది అని అడిగారు.

కళామాతాజీ : మీరు మాట్లాడుతున్నారు నాకు అర్థం కాదు. నాకు అర్థం కావాలంటే దాని గురించి తపస్సు చేయాలి. అంత శ్రమ ఎందుకు నాకు మీరు చెప్తారు కదా అన్నారు గురువు గారితో.

పై సంభాషణలోనే కాక అప్పుడప్పుడు గురువుగారి పరిచర్యల్లో భాగంగా కళా మాతాజీ గురువుగారితో స్వామీజీ ఎప్పుడూ నిద్రపోతుంటారే, ఎప్పుడూ నిద్రే నా అనేవారు. అందుకు సమాధానంగా గురువుగారు లేదని చెప్పేవారు.

ఈ సందర్భాలు పుస్తక ప్రారంభంలో తెలిపిన

జ్ఞాని శరీరముతో ఉన్నప్పటికీ తన సహజ ఆత్మ స్థితిలో ఉంటాడు. నిద్ర కాని నిద్రలో ఉంటాడు. అయినా శరీరంతో చేసే వ్యవహారం (కర్మ) కానీ, ధ్యాన నిష్ఠ కానీ, నిద్ర కాని వీటిలో ఏ ఒక్కటి అతనికి తెలియదు.

తురీయాన్ని 'ఎప్పుడూ మేల్కొనక నిద్రించే మహా నిద్ర' అని అన్నా **లేదా 'నిద్ర లేని కేవల నిత్య జాగ్రత్' అని అన్నా కూడా ఒకటే.**

అన్న విషయాన్ని తెలియజేస్తున్నాయి. భౌతిక దృష్టితో చూసినప్పుడు వారు నిద్రపోతున్నట్లుగా మనం భావించవచ్చు కానీ సరిగ్గా అర్థం చేసుకునే వారికి వారి సహజాత్మ స్థితిని ప్రత్యక్షముగా తెలియజేస్తున్నారు.

గురువుగారి కేవల ఆత్మైక్య స్థితిని తెలియజేసే మరికొన్ని సన్నివేశాలు ఏమిటంటే!

గురువుగారి దర్శనానికై వచ్చిన భక్తులతో మాతాజీ ఇలా చెప్పేవారు. స్వామీజీ అంతా మర్చిపోయారని చిన్న బాలుడు అయిపోయారని చెప్పేవారు. చూచేవారికి గురువుగారి వ్యవహారం కూడా అలాగే కనిపించేది. వచ్చిన భక్తులు కూడా అదేవిధంగా భావించేవారు. గురువుగారికి గుర్తు చేసే ప్రయత్నంలో భాగంగా భక్తులు వచ్చినప్పుడు మాతాజీ, గురువుగారితో వీరెవరో గుర్తున్నారా? స్వామీజీ అని అడిగేవారు. వచ్చిన భక్తులు కూడా మేము గుర్తున్నామా? స్వామి అని అడిగేవారు. కానీ సూక్ష్మ దృష్టితో గమనిస్తే ఆ మరపు గురువు గారికి ఎంతో ఆనందాన్ని కలిగించేదిగా తెలుస్తున్నది. ఒకసారి నెల్లూరు నుంచి వచ్చిన మహేంద్ర అనే స్వామి భక్తుడు. గురువు గారిని కలసి వచ్చిన తర్వాత గురువుగారు ఏం మాట్లాడారని నేను, అతనిని అడిగినప్పుడు ఈ విధంగా చెప్పారు.

స్వామి మీరు ఇంతకుముందు క్లాసులలో మాకు ఉపనిషత్తు వాక్యాలను, శ్లోకాలను వివరించి చెప్పేవారు కదా అవన్నీ గుర్తున్నాయా? స్వామి అని అడిగితే దానికి సమాధానంగా గురువుగారు అంతా మర్చిపోయానయ్యా, భగవంతుడు అంతా మర్చిపోయేటట్టు చేసి ఎంతో మేలు చేశారని సంతోషాన్ని వ్యక్తం

చేసినట్లు చెప్పారు. అటువంటి గురువు గారి ఆత్మైక్య స్థితిని క్రింది శాస్త్ర విషయాలు కూడా ఋజువు చేస్తున్నాయి.

చిత్తశాంతి కలిగిన బ్రహ్మ విద్వరిష్ఠుడు ఇంద్రియములను నిగ్రహించి బాలునివలెను, పిచ్చివాని వలెను, పిశాచము వలెను, నిద్రించు వాని రీతిగాను జగమును మరచి ఉండును.

(సీతారామాంజనేయ సంవాదము).

ఆత్మానుభవం పొందినవారే ఆ సుఖాన్ని అనుభవించగలరు. కానీ వారు దేహాత్మ బుద్ధి నశించి ఆ ఆనందాతీత మౌనాన్ని సాధించిన విధానం ఏమిటో వారికి తెలియదు.

అటువంటి ఆత్మానుభవ స్థితిలో నేను తరించుటకై గురువుగారు చేసిన ఉపదేశాలు అద్భుతమైనవి.

సాయంత్రం పూజకు సమకూర్చుకుని గురువుగారి దగ్గరకు వెళ్లాను. గురువుగారు విశ్రమించి ఉండగా నేను మౌనంగా కూర్చుని ఉన్నాను. 5:15 నిమిషాల సమయలో గురువు గారు నా వైపు తిరిగి గడియారాన్ని చూపిస్తూ 9, 10, 11, 12 గంటల వరకు వస్తే అదే ఫైనల్ కాబట్టి అంతవరకు రావడానికి ప్రయత్నించు. నీకు యోగా సర్టిఫికెట్ ఇస్తాను. కనుక నువ్వు వెళ్ళి దాని గురించి చూడమని చెప్పారు. (నేను చేస్తున్న 12 గంటల సాధనలో పరిపక్వత సాధిస్తే నిజమైన యోగత్వం ప్రసాదిస్తామని చెప్పుటకు యోగా సర్టిఫికెట్ అన్న పదం ఉపయోగించారని భావిస్తాను.)

డిసెంబరు 15, 2018 మధ్యాహ్నం 12 గంటలకు బుచ్చిరెడ్డిపాలెం వెళ్ళవలసి ఉండి గురువుగారి దగ్గరకు వెళ్లాను. అప్పుడు గురువుగారు

ఏమయ్యా వెళ్దామా? అన్నారు. నేను 12 గంటలు అయింది స్వామి అన్నాను. అప్పుడు గురువు గారు ఇలా సెలవిచ్చారు.

"నువ్వు చేస్తున్నట్లుగా ఉంటుంది. కానీ నువ్వు ఏమి చెయ్యవు. నీ వెనకాల ఏదో శక్తి అంతా చేస్తుంది. కాబట్టి నువ్వు ఏమి చెయ్యకు. నువ్వు నీ రూము(గది) లోనే ఉండు. అంతా నేను చేస్తాను. నేనే నీ రూము (గది) దగ్గరికి వస్తాను. కానీ అంతా నువ్వు చేసినట్లుగానే ఉంటుంది." కాబట్టి నీ రూములో ఉండు అని సెలవిచ్చారు.

డిసెంబర్ 19, 2018 సత్సంగంలో భాగంగా కృష్ణ సీరియల్‌లో కృష్ణార్జున సంవాదంలోని నిష్కామకర్మను వివరించు విధానాన్ని గురువు గారు ఇలా చెప్పారు.

"కర్మ చేయాలి తప్పదు కానీ కర్మ ఫలితాన్ని వర్జించాలి".

'త్యజించాలి' కనుక ఫలితాన్ని ఆశించకుండా కర్మలు చేయాలి.

జనవరి 2, 2019 నాటి గురువుగారి ఉపదేశం.

మీరు రమణమహర్షి పద్ధతిని అనుసరిస్తున్నారా? నేను అదే చెబుతున్నాను. కాబట్టి మీరు ఆ పద్ధతినే అనుసరించండి.

జనవరి 3, 2019 గురువు గారి ఉపదేశం.

గురువు గారు : సూర్యుని ఉద్దేశించి (ARE YOU SEEING DIRECTLY) నువ్వు నేరుగా సూర్యుని చూస్తున్నావా?

నేను : (YES) అవును స్వామీజీ.

గురువుగారు : (NOW YOU SEE WHAT HAPPEND) ఇప్పుడు చూడు ఏమవుతుందో.

నేను : నా అనుభూతిని చెప్పాను.

నాతో పాటే ఉన్న భక్తులతో గురువుగారు ఇలా సెలవిచ్చారు.

"నేరుగా చూడటమే అంతే చాలు" అని రమణ మహర్షి చిత్రాన్ని చూపిస్తూ చెప్పారు.

నాటి సాయంత్రం జర్మనీలో ఉంటున్న ఆంధ్ర వ్యక్తి సుబ్బారావు గారు, గురువు గారిని కలిసి రెండు ప్రశ్నలు అడిగారు.

1. కాన్షియస్ నెస్ (CONSCIOUSNESS) అంటే ఏమిటి?

2. నేను అంటే ఏమిటి? ఎలా తెలుసుకోవాలి? HOW TO GET EXPERIENCE

గురువు గారు సమాధానంగా ఇలా సెలవిచ్చారు. "అది తెలుస్తుంది కానీ తెలుస్తున్నట్లు కనిపించదు."

"YOU HAVE TO CONTEMPLATE ON SUN EVERYDAY THEN YOU WILL GET EXPERIENCE OF CONSCOUSNESS" "ప్రతి రోజు సూర్యునిపై ధ్యానించు అప్పుడు దాని (ఎరుక) స్పృహ అనుభూతికి వస్తుంది" అని సెలవిచ్చారు.

జనవరి 16, 2019 కృష్ణుడు, అర్జునునికి ఉపదేశించు విధానాన్ని ఇలా వివరించారు.

"సత్యసంధుడుగా జీవించమంటున్నారు, ఒక సన్యాసి లాగా జీవించ మంటున్నారండి" ఏమయ్యా అని మౌనంగా ఉపసంహరించారు.

జనవరి 17, 2019 నాటి సాయంత్రం నేను గురువుగారితో కలిసి మిద్దె పైన సూర్యునికి ఎదురుగా కూర్చుని ధ్యానం చేస్తున్నాను.

సూర్యునిపై ధ్యానం అయిన తర్వాత గురువు గారు ఇలా ఉపదేశించారు. సూర్యుని చూపిస్తూ

"HE IS READY TO TALK WITH YOU" "అతను నీతో మాట్లాడడానికి సిద్ధంగా ఉన్నాడు".

"HIS LANGUAGE IS SILENCE" "అతని భాష మౌనం (నిశ్శబ్దం)".

జనవరి 20, 2019 నాటి సాయంత్రం మూడు గంటలకు తిరుగు ప్రయాణంలో ఉన్న నెల్లూరు అతిథులను ఉద్దేశించి గురువుగారు నాతో ఏమయ్యా వాళ్లు అన్నారు.

నేను : వెళ్ళిపోతున్నారు స్వామీజీ అన్నాను.

గురువుగారు : వెళ్తున్నారు! నా దగ్గర ఒక్క నిమిషం ఉంటే దాని ప్రభావం వేరే తెలుస్తుంది అని గట్టిగా అన్నారు.

నేను : పిలువనా స్వామి అంటే.

గురువుగారు : ఆ పిలువు అన్నారు.

తరువాత వారి వివరాలు తెలుసుకొని వెళ్ళమని అజ్ఞాపించారు. (మహాత్ముల సన్నిధిలో ఒక్క క్షణం ఉంటే చాలు తరించుటకు)

ఫిబ్రవరి 9, 2019 సత్సంగంలో భాగంగా కృష్ణ సీరియల్ లో సన్నివేశాన్ని తీసేయమని కళా మాతాజీ, గురువు గారితో అన్నారు.

గురువుగారు : చూడవమ్మా! అన్నారు.

మాతాజీ : నేను చూడను స్వామి.

గురువుగారు : "నువ్వు చూసినా చూడకపోయినా అది (సచ్చిదానంద పరబ్రహ్మము) నిజం" అని సెలవిచ్చారు.

సత్సంగం అయిన తర్వాత గురువు గారు నన్ను ఏమయ్యా అది నిజమా? ఇది నిజమా? అని అడిగారు. నేను అంతా నిజమే అని చెప్పబోతుండగా గురువుగారు రెండు నిజమే అంటారా? అన్నారు. అప్పుడు నేను మీరే చెప్పారు కదా స్వామి "నువ్వు చూసినా చూడకపోయినా అది (సచ్చిదానంద పరబ్రహ్మము) నిజం" అని అన్నాను.

ఫిబ్రవరి 10, 2019 నాటి గురువుగారి ఉపదేశం.

ఇదంతా నాటకంలో భాగమే నిజమని భ్రమ పడేరూ! (ఇప్పుడు మన ముందు జరుగుతున్నది, మనం చూస్తున్నది అంతా)

ఫిబ్రవరి 20, 2019 సాయంత్రం గురువుగారి సత్సంగంలో భాగంగా THIS IS LIFE AND DEATH PROBLEM SO TOTALLY SURRENDER TO HIM అని చెప్తూ పూర్తిగా సచ్చిదానంద పరబ్రహ్మ కొరకు తనను తాను సమర్పించుకోవాలి అని, ఆ విధంగా (సచ్చిదానందం) ఉండాలని చెప్పారు.

ఫిబ్రవరి 21, 2019 సాయంత్రం నాలుగు గంటలకు ఆహారం తీసుకొని గురువుగారి దగ్గరకు వెళ్ళి నమస్కరించి నిల్చున్నాను. గురువుగారు వెంటనే లేచి బయలుదేరుతున్న విషయం గమనించిన వైజయంతి మాతాజీ ఎక్కడికి వెళ్తున్నారు అని అడిగారు. గురువుగారు ఆయన వచ్చారు అనగా ఆయన రోజూ వస్తున్నారు కదా వెళ్ళకండి. ఇక్కడే నడవండి అన్నారు వైజయంతి మాత. కానీ గురువు గారు

నేరుగా వెళ్ళి వారి గది తాళం తీసుకుని బయలుదేరారు. అలా మేము ఇద్దరం పైన ఉన్న గురువు గారి గదికి వెళ్ళి అక్కడ కూర్చున్నాము. కొంతసేపు మౌనంగా ధ్యానంలో ఉన్నాము.

తర్వాత

నేను : స్వామీజీ నా కర్తవ్యం ఏమిటా? అని ఆలోచిస్తున్నాను.

గురువుగారు : అవును (కొంత సమయం మౌనంగా గడిచిన తరువాత)

నేను : మీ శిష్యునిగా పూర్తిగా మిమ్మల్ని అనుసరించడమే నా ధర్మం స్వామీజీ.

గురువుగారు : అవును (మరల కొంత సమయం మౌనంగా గడిచిన తర్వాత)

నేను : స్వామీజీ జీవితాన్ని మొత్తం సచ్చిదానంద పరబ్రహ్మానికి అర్పించినట్లయితే వ్యవహారం కూడా అందులో కలిసి పోతుంది కదా?

గురువుగారు : అవును, అక్కడ రమణ మహర్షి చెబుతున్నాడు కదా! మోక్షం అనగానేమి? అని బంధమున ఉన్న తనను తాను తెలుసుకోవడమే మోక్షం.

(క్రింద నుంచి కళా మాతాజీ, బ్రహ్మ చైతన్య అని పిలిచారు. నేను లేచి వెళ్లబోతుండగా గురువుగారు వెళ్లవద్దని చేతితో సంజ్ఞ చేశారు. వారు మరల మరల పిలుస్తున్నారు. కానీ గురువు గారు నాతో పలకొద్దని సంజ్ఞ చేస్తున్నారు. తరువాత రమణానంద స్వామి

పిలిచారు. అప్పుడు కూడా గురువుగారు నాతో పలకొద్దని సంజ్ఞ చేశారు. కళామాత, స్వామీజి అని గురువు గారిని కూడా పిలిచారు. వారు కూడా పలకలేదు. రమణానంద స్వామి పైకి వచ్చి చూసి ధ్యానం చేస్తున్నారని చెప్పి వెళ్లిపోయారు. కింద నుంచి మాతాజీ, గురువుగారి కొరకు సిద్ధం చేసిన ఆహారం తీసుకుని పైకి వచ్చి, నాతో ఇలా అన్నారు. స్వామీజీని నువ్వు తీసుకొచ్చావు? కదా, స్వామీజీతో ఈ పాలు తాగించు అని నా ముందు పెట్టి వెళ్ళిపోయారు. ఆ రోజులలో గురువుగారు ఆహారం తీసుకోవటానికి నిరాకరించే వారు, ఎంతసేపో బతిమాలి ఆహారం ఇవ్వవలసి వచ్చేది.)

నేను : సన్యాసం అంటే త్యాగానికి గుర్తు అని మీరు చెప్పి ఉన్నారు. శాస్త్రీయంగా దాని ఆవశ్యకత ఉన్నదా? స్వామి.

గురువుగారు : ఏముంది అలా ఉండటమే తెలుసుకుని.

నేను : చివరగా ఉన్న దానిని తెలుసుకొని అలా ఉండటమే కదా స్వామి చేయవలసింది.

గురువుగారు : అవును YOU TELL THEM FINAL AND END OF THE TECHNIQUE అని ముగించారు.

గురువుగారు నన్ను పాలు తీసుకోమని చెప్పగా నేను ఇది నా కోసం కాదు స్వామి మీ కొరకే తెచ్చారు, మీకు ఇవ్వమని నా దగ్గర ఉంచారని చెప్పగా గురువుగారు ఆహారాన్ని స్వీకరించారు.

ఫిబ్రవరి 22, 2019 సాయంత్రం మూడున్నర గంటలకు గురువుగారి దగ్గరకు వెళ్లాను. ఆ సమయంలో గురువుగారు రామ్ ప్రసాద్ అనే భక్తునితో ఉన్నారు. నేను వెళ్ళగానే ఆహారం తీసుకోమని

సంజ్ఞ చేశారు. నేను ఆహారం తీసుకుని వచ్చిన తర్వాత మనం పోదాం పైగి అన్నారు. మాతాజీ నాలుగు గంటలకు కదా అంటే నాలుగు గంటలకట అని మౌనం వహించారు.

నాలుగు గంటలకు గురువుగారు, నేను కలిసి పైన వారి గదికి వెళ్ళాము. అక్కడ నిన్నటి లాగే మా స్థానాలలో కూర్చున్నాము. కొంతసేపు మౌనంగా సాధన చేసిన తర్వాత.

నేను : రమణ జ్యోతిలో ఈసారి మౌనం గురించి రమణ మహర్షి – మౌన సాధన అని చాలా బాగా రాశారు స్వామీజీ అన్నాను.

గురువుగారు : నవ్వుతూ తర్వాత ఏమైంది అన్నారు.

నేను : మౌనం నిరంతర వాగ్ఘరి అని మాటల వలన దానికి అఘాతం ఏర్పడుతుంది అని రాశారు. తీసుకురానా? స్వామి పుస్తకం అంటే.

గురువుగారు : ఎందుకు ఇక్కడ ఉన్నదే అక్కడ రాశారు కదా! అన్నారు. నవ్వుతూ

(ఇక్కడ గురువు గారి స్థితి మనసు లేని మౌన స్థితి దాని తెలియజేయడమే కాక మనం ఇక్కడ, ఇప్పుడు ఏమి చేస్తున్నామో దానినే అక్కడ రాశారు కదా అని అంటున్నారు. (అయినా కేవలమౌన స్థితిని బడసిన వారికి పుస్తకాలతో పని ఏముంటుంది.)

సాయంత్రం 5 గంటలకు మౌన సాధన ముగిసిన తర్వాత సూర్య ధ్యానమునకు మేడపైకి వెళ్ళాము. అక్కడ సూర్యునికి ఎదురుగా కూర్చున్నాము. గురువుగారు సూర్యుని చూపించి నవ్వుతూ SUN IS VISIBLE BUT NOT VISIBLE అన్నారు.

నేను "అవును స్వామీజీ ALL SUN FAMILY LIKE A SMALL DOT SO SUN IS VISIBLE BUT NOT VISIBLE అన్నాను.

ఫిబ్రవరి 23, 2019 సాయంత్రం సత్సంగం అయిన తర్వాత గురువు గారికి నమస్కరించి వచ్చేటప్పుడు నేను, రమణానంద స్వామి ఇద్దరమే ఉన్నాము. గురువు గారు మాతో "అంతా వదిలి పెట్టాలి" అలాంటి వాళ్ళు ఎవరైనా ఉన్నారా? ఇక్కడ అన్నారు.

ఫిబ్రవరి24, 2019 సాయంత్రం ఏడు గంటలకే గురువుగారు సత్సంగ సమయాన్ని ముగించారు. తర్వాత రమణానంద స్వామి గురువుగారి పాదాలకు నూనె రాస్తానని అన్నారు. గురువుగారు వద్దన్నారు. అందుకు వారు లేదు స్వామి రాస్తానని మొదలుపెట్టారు. నేను గురువుగారి పక్కనే కూర్చొని ఉన్నాను. కళా మాతాజీ నన్ను పాలు తీసుకోమని చెప్పారు. కానీ నేను అలాగే కూర్చుని ఉన్నాను. కొంత సమయం గడిచిన తరువాత గురువు గారు నాతో ఏమయ్యా నీ ఆహారం తీసుకున్నావా? అని నన్ను అడిగితే సమాధానంగా కళా మాతాజీ లేదు స్వామి అన్నారు. గురువు గారు నాతో, వెళ్లి ఆహారం తీసుకో అన్నారు. జయంతి మాతాజీ గురువుగారికి కూడా ఆహారం ఇచ్చారు. నేను ఆహారం తీసుకొని గురువుగారి దగ్గరకి వెళ్లి కూర్చున్నాను.

అప్పుడు గురువుగారు నా పక్కనే ఉన్న రమణానంద స్వామితో ఏమయ్యా వైరాగ్యం కావాలి ఏం చేయాలి? అని అడిగారు.

రమణానంద స్వామి : చెప్పండి స్వామి మీరే ! అన్నారు.

గురువుగారు : మరల, వైరాగ్యం అంటే ఏమిటి?, దానికి ఏమి చేయాలి చెప్పు? అన్నారు.

రమణానంద స్వామి : మీరే అని ఏదో చెప్పడానికి ప్రయత్నించగా

గురువుగారు : మరలా అదే ప్రశ్న వేసి, మీరేమో చదువుకున్న వారు ఏదో MA చేశారు. ఈయనేమో ఏమీ చదువుకోలేదంటారు అని నా వైపు చూపుతూ, ఇది మీ ఇద్దరికీ తేడా అన్నారు.

రమణానందస్వామి : ఇవి భౌతిక చదువులు స్వామి మీ కన్నా మాకు ఏమి తెలుసు అన్నారు.

గురువుగారు : సరే మీరు చెప్పడం లేదు వెళ్ళి ఆలోచించండి. నేను రేపు నిన్ను కలుస్తాను అని రమణానంద స్వామితో, నన్ను కలుస్తానని నాతో అన్నారు.

ఫిబ్రవరి 25, 2019 సాయంత్రం 4:15 నిమిషాలకు గురువుగారు, నేను కలిసి వారి గదికి వెళ్ళాము. అక్కడ ఇంతకుముందులాగే మా స్థానాలలో మేము కూర్చుకున్నాము. వైరాగ్యం గురించి నిన్న గురువుగారు అడిగిన విధానాన్ని నేను రాసుకున్న నోట్స్ తీసుకెళ్ళి అందులో భగవాన్ చెప్పిన రెండు సందర్భాలను చెప్పాను. అది విని గురువుగారు దీని గురించి మాట్లాడదాం అని మౌనంగా కొంతసేపు ధ్యానంలో ఉన్నారు. తరువాత వారు ఇలా ఉపదేశించారు.

"రెండు లేవు అక్కడ ఒక్కటే ఉన్నది, అంతకు ముందే ఉన్నది" అని చెప్పారు. **UNITY OF UNIVERSAL IS THERE. WE WILL FEEL IT. ONCE WE WILL ACCEPT IT RE-MAINING ALL ARE GONE "విశ్వజనీనంగా ఉన్నటువంటి శక్తి ఒక్కటే ఉన్నది. మనం దానిని అనుభూతి చెందవలసి ఉన్నది.**

ఒకసారి మనం దానిని అంగీకరిస్తే మిగిలినవన్నీ పోతాయి. దానికి ఎవరి సహాయం అక్కర్లేదు" అని సెలవిచ్చారు.

తర్వాత ఐదు గంటలకు సూర్యుని ధ్యానించుటకు పైకి వెళ్దామని సంజ్ఞ చేశారు. గురువు గారిని అనుసరించి పైకి వెళ్ళాము. అక్కడ కూర్చుని ఆరు గంటల వరకు సూర్య ధ్యానంలో ఉన్నాము. నేను తిరిగి వచ్చేటప్పుడు గురువుగారు నా వైపు చూసి నవ్వుతూ 'YOU CAN SEEN IT' అంటే 'WE WILL ACCEPT AND FEEL IT' అన్నాను.

రాత్రి 7 గంటలకు సత్సంగం ముగిసిన తర్వాత యోగ వాశిష్ఠం లోని సందర్భం విన్న గురువుగారు నన్ను ఇలా ఆదేశించారు. వాసనాక్షయం అవ్వాలట కాబట్టి నువ్వు బయలుదేరి పోయి ఆ వాసనలు ఏమిటో చూడు అన్నారు.

(ఇక్కడ గురువు గారు మన వాసనలు ఏమిటో గమనించి వాటిని తొలగించుకొని ఆత్మ జ్ఞానాన్ని పొందాలని ఆదేశించడమే కాక వారి అతీత స్థితిని మరోసారి తెలియజేస్తున్నారు. గురువుగారు వాసనలు క్షయమైన ఆనంద స్థితిలో ఉన్నారు. కనుక ఆ వాసనలు ఏమిటో మాకైతే కనిపించట్లేదు మీరు పోయి అవేమిటో చూడు అని చెప్పినట్లుగా ఉన్నది.)

ఫిబ్రవరి 26, 2019 సాయంత్రం మూడు గంటల 40 నిమిషాలకు ఆహారం తీసుకొని గురువుగారి దగ్గరకు వెళ్లాను. గురువుగారు గడియారం వైపు చూసి నాతో ఏదో విషయం చెప్పడానికి ప్రయత్నిస్తుండగా దగ్గరగా వెళ్ళి స్వామి అన్నాను. అప్పుడు గురువు గారు మనం అది చూపించాలి పిక్చర్స్‌గా ఉండేది అని, వెంటనే

లేచి గురువు గారి గది తాళం తీసుకుని నా చేతికి ఇచ్చి పోదాం అన్నారు. నాలుగు గంటలకు గురువు గారి గదిలో యథాస్థానాల్లో కూర్చున్నాము.

అప్పుడు గురువుగారు భగవాన్ చెప్పిన '**కర్త వారి వారి ప్రారబ్ధ కర్మానుసారం జీవుల నాడించును. జరగనిది ఎవరెంత ప్రయత్నించినను జరగదు. జరుగునది ఎవరెంత యడ్డుపెట్టి నను జరుగనే జరుగును. ఇది సత్యము కనుక మౌనముగా నుండుటయే ఉత్తమము**'. అన్న పోస్టర్ గురువుగారి గది తలుపుకు అంటించి ఉన్నది చూపిస్తూ నిన్న నోట్ బుక్‌లో చెప్పిన విషయానికి ఇది సరిపోతుంది అన్నారు. (మొన్న గురువు గారు వైరాగ్యం అంటే ఏమిటి? దాని కోసం ఏమి చేయాలి? అని అడిగిన దానికి భగవాన్ చెప్పిన విషయాలను నా పుస్తకంలో రాసుకుని నిన్న చూపించినప్పుడు దీని గురించి తర్వాత మాట్లాడుదాం అన్నారు. కాబట్టి నేను నోట్ బుక్‌లో చెప్పిన దానికి ఇది సరిపోతుంది అని చెప్పారు). సినిమా తెర ఉపమానముగా చెప్పారు.

అంతటిలో ఒకే శక్తి ఉన్నదని "**ఒక్కటే ఉన్నది**" అని చెప్పారు.

ఫిబ్రవరి 28, 2019 మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గురువు గారు కృష్ణ మందిరం నుండి బయటకు వచ్చి నన్ను చూసి పిలిచారు. మౌన భాషలో స్వామీజీ గది తాళం తీసుకోమన్నారు. తర్వాత నన్ను ఆహారం తీసుకోమని చెప్పగా ఆహారం తీసుకుని గురువు గారితో కలిసి వారి గదికి వెళ్ళాము. తరువాత నిన్న సాయంత్రం గురువుగారికి, నాకు మధ్య జరిగిన చర్చను అనుసరించి నా నిర్ణయాన్ని తెలుపుతూ గురువు గారితో ఇలా అన్నాను. స్వామీజీ,

మానసికంగా, భౌతికంగా అన్ని త్యజించాలనుకుంటున్నాను. (I WANT TO RENOUANCE ALL MENTAL AND PHYSICAL THINGS) అని. **అప్పుడు గురువు గారు అవును అదే సులభం. అక్కడ సచ్చిదానంద పరబ్రహ్మము తప్ప వేరే ఏమీ ఉండదు అన్నారు.** (ఇది గురువు గారి ప్రత్యక్ష అనుభవం).

మార్చి 6, 2019 సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో గురువు గారిని కలవడానికి వెళ్లి కృష్ణ మందిరం తలుపు దగ్గర నిలబడి ఉన్నాను. ఇంతలో మాతాజీ మాటలు వినిపించి స్వామీజీకి ఆహారం ఇస్తున్నారని తెలుసుకొని కొంచెం వెనక్కి వచ్చి ఇనుప గేటు వద్ద నిల్చున్నాను. గురువు గారు ఆహారం తీసుకున్న వెంటనే నన్ను చూడకపోయినా నా కోసం హడావుడిగా బయలుదేరి రావడం చూచి వైజయంతి మాతాజి ఏమిటి స్వామి! ఎవరు కావాలి? అని అడిగి, స్వామీజీ చెప్తున్న మాటలు అర్థం చేసుకుంటూ బ్రహ్మ చైతన్యను పిలవాలా అన్నారు. కళామాతాజీ లోపలి నుండి బయటి వైపు వస్తూ గేటు ఎదురుగా ఉన్న నన్ను చూసి ఇదిగో ఇక్కడే ఉన్నారాయన, ఆయన ఇక్కడే తిరుగుతూ ఉంటారు. ఆయనను చూస్తే చాలు, ఈయన ఇక ఆగరు. అని నాతో కాస్త నడిపించవచ్చు కదా, ఏమైనా మాట్లాడించవచ్చు కదా అన్నారు. గురువుగారు నా వైపు చూసి లోపలికి రమ్మని సంజ్ఞ చేశారు. తర్వాత గురువు గారు కృష్ణ మందిరంలో నడిచారు. నేను వారిని అనుసరించాను. నేను ఏమీ మాట్లాడలేదు, ఏమీ చెప్పలేదు.

సాయంత్రం 6 గంటలకు పూజ తర్వాత సత్సంగ సమయంలో గురువుగారు ధ్యానం చేయించారు. ఆ రోజు గురువు గారు ఆ

సమయంలో పూర్తి మౌనం వహించి, ధ్యానసాధన ముగింపు కూడా మౌన సంజ్ఞతో చేశారు. తర్వాత నన్ను ఆహారం తీసుకోమని సంజ్ఞ చేయగా, నేను ఆహారం తీసుకుని గురువు గారికి నమస్కరించి నా గదికి వచ్చాను.

మార్చి 12, 2019 సాయంత్రం సత్సంగంలో గురువుగారి ఎదురుగా రమణానంద స్వామి కూర్చున్నారు. గురువుగారి ఆసనానికి (కుర్చీ) ఎడమవైపు నేను కూర్చున్నాను. కుడివైపు కళా, వైజయంతి మాతలిద్దరూ కూర్చున్నారు.

గురువుగారు : నవ్వుతూ మీ సైంటిస్ట్ (పరిశోధకులు) ఎవరు? ఇక్కడ తెలిసిందా! అని అడిగారు

రమణామంద స్వామి : మీరే సైంటిస్ట్ (పరిశోధకులు) స్వామి అన్నారు. **గురువుగారు :** నవ్వుతూ, నేనే సైంటిస్టా (పరిశోధకులు) అని నావైపు చూసి (నీ సమాధానం ఏమిటి?) నువ్వు? అన్నారు.

నేను : ఎవరికి వారే సైంటిస్టు (పరిశోధకులు) అన్నాను.

గురువుగారు : ఎవరికి వారే సైంటిస్ట్ (పరిశోధకులు) అంట. ఇంకా గొప్పగా ఉన్నారీయన అని, వైజయంతి మాతతో నువ్వేమి సైంటిస్టు (పరిశోధకులు) అన్నారు.

వైజయంతి మాత : నేనేమి పరిశోధన చేస్తున్నానా? ఆత్మ పరిశోధన చేస్తున్నాను.

గురువుగారు : మీరండి అని కళా మాతను అడిగారు.

కళామాత : నేనా! ఆత్మ విచారణ చేస్తున్నాను.

గురువుగారు : కాబట్టి విచారణ అంటే ఏమిటి?

కళామాత : ఏదైనా ప్రశ్నకు జవాబును వెతుక్కోవడం, నేను ఎవరు అనే ప్రశ్నకు జవాబు వెతుక్కోవడం.

గురువుగారు : ఏమండి అని వైజయంతి మాత వైపు చూశారు.

వైజయంతి మాత : నేనా! నేనుగారు అంటే ఏమిటి? నేను గారు ఎక్కడ ఉన్నారా! అని విచారణ చేస్తున్నాను.

గురువుగారు : మీ రండి అని నన్ను అడిగారు.

నేను : భగవాన్ సమాధానమైతే మనసును తనయందే ఉంచుకొనుట విచారణ అని అన్నారని చెప్పాను.

గురువుగారు : భగవాన్ ఏమి చెప్పారో అది చెప్పారండి మీరేమి చెప్తున్నారు? అని, ఏమండి మీరు? అని రమణానంద స్వామి వైపు చూశారు.

రమణానంద స్వామి : నేనెవరు? అని విచారణ చేస్తున్నాను స్వామి.

గురువుగారు : మౌనంగా ఉన్నారు.

వైజయంతి మాత : స్వామి ఇంతకు విచారణ అంటే ఏమిటి అని అడిగారు.

గురువుగారు : ఏమిటి?

వైజయంతి మాత : మేము అనుకున్నది సరైనదా కాదా మీరు చెప్పాలి కదా స్వామి.

గురువుగారు : అలాగా ఏమండీ? అని కళా మాతవైపు చూశారు.

కళామాత : అవును చెప్పాలి. మేము చేసేది సరైనదా, కాదా అని.

గురువుగారు : కాబట్టి మీకు పరిశోధన అంటే ఏమిటో తెలియదు.

వైజయంతి మాత : పరిశోధన అంటే విచారణ అని చెప్పాం కదా!.

కళామాత : చేస్తున్నాము, పరిశోధన (విచారణ) అనేది చేస్తున్నాము.

గురువుగారు : కానీ ఏమిటా విచారణ?

కళామాత : అంత త్వరగా ఎలా తెలుస్తుంది. చేస్తూ ఉంటే తెలుస్తుంది.

గురువుగారు : నేను అంటున్నారు. నేను గారు అంటే ఏమిటి అని విచారణ చేస్తున్నారా? అని, మీరండి అని రమణానంద స్వామి వైపు చూశారు.

రమణానంద స్వామి : ప్రతి ఆలోచన ఎక్కడ నుండి వస్తుంది అని ప్రశ్న వేసుకుంటూ, నా నుండి వస్తుంది. నేను అంటే ఏమిటి? అని విచారణ చేస్తున్నాను.

గురువుగారు : మీ రండి మీరేమి చేస్తున్నారు అని నన్ను అడిగారు.

నేను : ఒకే విషయం పైన నిరంతర చింతన అనగా

గురువుగారు : నా మాట అందుకుంటూ విచారణ అంటే అంతేనా? అన్నారు.

నేను : అవును స్వామీజీ, అది తప్ప వేరేది ఉండకూడదు అన్నాను.

గురువుగారు : ఏమండి అంతేనా? ఆయన చెప్పేది సరిగ్గా ఉందా అని వైజయంతి మాత వైపు చూశారు.

వైజయంతి మాత : నాకేమి తెలుసు, మీరు చెప్తే తెలుస్తుంది.

గురువుగారు : నవ్వుతూ, కాబట్టి మీకేం తెలుసన్న మాట? మీకు ఏమీ తెలియదు. అని మీరు ఏమిటి? అని కళా మాత వైపు చూశారు.

కళామాత : నేను చెప్పాను కదా! అన్నారు.

గురువుగారు : ఏమి చెప్పారు? కదా!

కళామాత : విచారణ చేస్తున్నానని చెప్తున్నాను.

గురువుగారు : విచారణ చేస్తున్నానని చెప్తున్నారు. విచారణ అంటే ఏమిటి?

కళామాత : నేను ఉన్నాను. నేను ఎలా ఉన్నానో తెలుసు. కానీ అనుభవపూర్వకంగా తెలియదు. అలా అని మీరు నిద్ర పోలేదా? అంటే నిద్రలో మీరు ఏమిటో తెలియదా? అంటే అది తెలుసు. తెలుసు కానీ తెలియదు అన్నారు.

గురువుగారు : కాబట్టి నేను అంటే ఏమిటో తెలియదు. ఆ తెలియనిది ఏమిటా! అని విచారణ చేస్తున్నారా? మీరు.

కళామాత : నవ్వుతూ, నాకు అర్థం కాలేదన్నారు.

గురువుగారు : నేను అంటున్నారు ప్రతి వాళ్ళు. నేను అనేది ఎక్కడి నుంచి వస్తుంది అని విచారణ చేస్తున్నారా? మీరు, అంతేనా?

కళామాత : అవును ఎక్కడ నుండి వస్తుంది, ఎవరు మాట్లాడుతున్నారని ఒక దాని తరువాత ఒకటి ఆలోచిస్తూ విచారణ చేస్తున్నాను.

గురువుగారు : కాబట్టి ఇప్పుడు దీని ద్వారా ఏమి తెలిసింది. నేను గారు అంటే ఏమిటో తెలియదు, పరిశోధన అంటే ఏమిటో తెలియదు, పరిశోధనలో ఏమి చేయాలో తెలియదు. ఏమయ్యా అంతేనా? అని నవ్వుతూ రీసెర్చ్ (పరిశోధన) అంటే తెలియదా? అన్నారు.

వైజయంతి మాత : రీసెర్చ్ (పరిశోధన) అంటే ఇన్వెస్టిగేషన్ (అన్వేషణ) అని చెప్పాం కదా!

గురువుగారు : నేను అంటే ఏమిటో తెలియదెవరికీ అంతేనా? ఏమండీ అని రమణానంద స్వామి వైపు చూశారు.

రమణానంద స్వామి : అవును స్వామీజీ

గురువుగారు : ఏమండీ తెలియదా? అని వైజయంతిమాత వైపు చూశారు.

వైజయంతి మాత : నేను దేహమని ఎప్పుడూ అనిపిస్తుందే గాని, నేను ఆత్మ స్వరూపం అని అనిపించాలి.

గురువుగారు : అనిపించాలి. కానీ అది ఏమిటి?, ఏమండీ నేను అనేది ఏదో ఉందట దానిలో నుండే వస్తుందట ఈ నేను అనేది. ఆ నేను అనేది ఏమిటి? అని ప్రశ్న (కొంత మౌనం తర్వాత)

గురువుగారు : ఈ నేను అనేది ఏమిటి? ఏమిటండి నేను?

వైజయంతి మాత : నేను అనేది ఉనికి, ఎరుక.

గురువుగారు : ఉనికి, ఎరుక అంటే?

వైజయంతి మాత : ఉనికి అంటే ఉన్నది, ఎరుక అంటే ఉన్నదని తెలుసుకోవటం.

గురువుగారు : ఉనికి అంటే ఏమిటి? అనే ప్రశ్న వచ్చింది. దాన్ని విచారణ చేస్తే దానికి మూలం ఏమిటి? అంటున్నారు. ఈ నేను అనేది ఒకటి వస్తుంది. ఆ నేను ఎక్కడ నుండి వస్తుంది, ఏమిటది?

నేను : నేను ఏమిటో తెలియదు స్వామీజీ దాని స్ఫురణ మాత్రమే ఉంటుందన్నాను.

గురువుగారు : నేను ఏమిటో తెలియదు కానీ స్ఫురణ అంటే ఏమిటో తెలుసా? కాబట్టి నేను దగ్గరికి వచ్చిందిప్పుడు. నేను అంటే ఏమిటో, దాని స్ఫురణ అంటే ఏమిటో? ఏమండీ నేనంటే ఎక్కడి నుండి వస్తుంది.

రమణానంద స్వామి : అది అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి.

గురువుగారు : తెలుసుకోవాలి, తెలుసుకోవడం అంటే ఏమిటి? అనేది ప్రశ్న.

రమణానంద స్వామి : తెలుసుకొనే ప్రయత్నం చేయటం.

గురువుగారు : ఆ ప్రయత్నం అంటే ఏమిటి? ఎవరో చేస్తున్నారు కదా! అది ఎవరు? నేను అనే పరిస్థితి ఎక్కడి నుండి వస్తుంది అనేది తెలియడం లేదు. నేను అనేది ఒకటి ఉంది, కానీ ఏమిటది? నేను గురించిన పరిశోధనలో నేను దగ్గరికి వచ్చాము. నేను గారు అంటే ఏమిటి ఎవరు? అనే దగ్గరకు వచ్చాం. స్ఫురణ అనే పదం ఉపయోగించారు ఇక్కడ. అది అందరికీ వస్తుంది, ఆ నేను అనేది. కానీ ఏమిటది? నేను అంటే ఏమిటి, ఎక్కడ నుండి వస్తుంది?

నేను : స్ఫురణకు కేంద్రం ఉపాదేయం అని చెప్తున్నారు స్వామి.

గురువుగారు : కేంద్రం అనే పదం ఉపయోగిస్తున్నారు.

నేను : హృదయం అని అంటున్నారు కదా!

గురువుగారు : హృదయం, స్ఫురణ అంటున్నారు కదా! ఆ అంటున్నది ఎవరు? స్ఫురణ అంటే ఏమిటి? అనే ప్రశ్న వచ్చింది. కానీ ఎవరు ఈ ప్రశ్న చేసేది?

కొంతసేపటి తరువాత

గురువుగారు : పొద్దున్నే లేస్తాం మనము, సూర్యుడు ప్రకాశిస్తాడు, సూర్యుడు ప్రకాశిస్తున్నాడు బ్రహ్మాండంగా అనగా

వైజయంతి మాత : నేనుగారంటే స్వయం ప్రకాశం.

గురువుగారు : అదేనండి, ఆ ప్రశ్న వేసేది ఎవరు?

వైజయంతి మాత : నేనే

గురువుగారు : నేను గారే, నేను గారు అంటే ఎవరు? ఈ నేను గారు అంటే ఏమిటో తెలుస్తుంది. దాని స్ఫురణ ఉంటుంది. కానీ ఏమిటది? ఈ పద్ధతి అందరికీ ఉండేదే కాని తెలియదు.

కొంత మౌనం తర్వాత

గురువుగారు : ఆత్మ అంటే ఏమిటి? స్ఫురణ అంటే ఏమిటి? విచారణే! విచారించాలట కానీ ఎవరా విచారం చేసేది?

కళామాత : నేనే

గురువుగారు : నేనే అంటే? (కొంత మౌనం) అంతటా అంటారు.

అంతటా వ్యాపించి ఉంది అంటారు. అంతటా అంటే ఎంతట? అంతటా అంటే ఏమిటి?

కళామాత : లోపలా, బయటా అంతటా, శరీర పరంగా చూస్తే లోపలా, బయటా అంతటా.

గురువుగారు : శరీర పరంగా అని ఒప్పుకోవాలి కదా నువ్వు.

కళా మాత : శరీర పరంగానే కదా మనం మాట్లాడుకునేది.

గురువుగారు : మాట్లాడుతున్నాం అంటున్నారు, ఎవరు మాట్లాడేది?

కళామాత : ఆ ఎవరు మాట్లాడుతున్నారు అనే దాని కోసమే ఇదంతా.

గురువుగారు : కాబట్టి ఎలాగైనా ఈ విచారణ చేయాలి అంటే దాని గురించి ఏం మాట్లాడకూడదు. అంతే! దేవుడు అదంతా రాకూదదు.

కళా మాత : ఏదో చెప్పాలి కాబట్టి దేవుడు

గురువుగారు : ఏదో చెప్పాలి కదా అంటే ఎవరా చెప్పేది?

కళా మాత : అదే.

గురువుగారు : అదే కదా అంటే?

కళా మాత : సమాధానం లేదని తెలిసి నవ్వుకున్నారు.

గురువుగారు : అక్కడికి వచ్చామండి మనం కాబట్టి ఎరుక అంటే ఏమిటి?

వైజయంతి మాత : ఎరుక అంటే తెలివి.

గురువుగారు : తెలివి అంటే ఏమిటి?

వైజయంతి మాత : ఎరుక.

రమణానంద స్వామి : CONSCIOUSNESS. (గురువు గారితో సహా అందరం నవ్వుకున్నాము)

గురువుగారు : ఏమిటది? ఆ కాన్షియస్నెస్ (CONSCIOUS-NESS).

కాబట్టి అక్కడ దాని దగ్గర నిలబడున్నామండి మనం. నేను అంటే ఏమిటి? దాన్ని తెలుసుకోవాలని ఉంది. ఎక్కడ తెలుసుకోవాలి. ఎక్కడి వరకు ఉన్నదీ ఉనికి, ఎరుక? ఏమిటది? కాబట్టి ప్రశ్నకు జవాబు కనుక్కోవాలండి మీరు ఇది పరిశోధన అంటే.

రమణానంద స్వామి : దాన్ని ప్రశ్నించే దెవరు అనేది.

గురువుగారు : ప్రశ్నించేది ఎవరు? అనే ప్రశ్న వస్తుంది. అయితే దీనిని ఎవరి పాటికి వాళ్ళు కనుక్కోవాలి. సూర్యభగవానుని చూదాలి దీన్ని కనుక్కోవాలంటే. ఈ ప్రశ్నకు జవాబు కనుక్కోవాలి. ఇదే పరిశోధన అంటే. ఎవరి ప్రశ్నకు వారు జవాబు కనుక్కోవాలండి. పరిశోధన అంటే అది. తికమక ప్రశ్న ఏమి లేదు.

రమణానంద స్వామి : ప్రశ్నించేది ఎవరు, ఎక్కడనుండి వస్తుంది అంతే కదా స్వామి.

గురువుగారు : ప్రశ్నించేది ఎవరో జవాబు అదే. ఉనికి అంటే ఏమిటి'? ఎరుక అంటే ఏమిటి? ఈ ప్రశ్నకు జవాబు కనుక్కోవాలండి మీరు, ప్రతివారు.

వైజయంతి మాత : ప్రయత్నం చేస్తున్నాం.

గురువుగారు : ఈ ప్రశ్నకు జవాబు వెంటనే దొరకదు కానీ జవాబు దొరుకుతుంది. కానీ ఎట్లా దొరకుతుంది? అది పరిశ్రమ, యోగ పరిశోధన అంటే ఇదే. దాని గురించి ఇంకేమీ మాట్లాడేదానికి లేదు.

సత్సంగం అయిపోయిన తర్వాత నేను ఆహారం తీసుకుని వచ్చి గురువుగారి దగ్గర కూర్చున్నాను. రమణానంద స్వామి గురువుగారి పాదాలకు నూనె రాసి, అక్కడే కూర్చుని గురువు గారితో, స్వామీజీ దానిని ఎలా ప్రాక్టీస్ (సాధన) చేయాలి అని అడిగారు.

గురువుగారు : ప్రాక్టీస్ (సాధన) చేయాలని అనుకోవాలి కదా? అనుకోవడానికి ఒకరు ఉండాలి. వచ్చి, పోయేది ప్రశ్న. జవాబు లేదు. ఆ స్థితికి వస్తూనే అక్కడ ప్రశ్న, జవాబు లేదు.

రమణానంద స్వామి : ఇక్కడ ఇది ఉన్నది అని ఒక వస్తువును చూపిస్తూ ఏదో చెప్పుటకు ప్రయత్నించారు.

గురువుగారు : ఇదిగో ఇక్కడ, అక్కడా అని అన్నావంటే మనసు వచ్చినట్టే. ఆ మనసు వచ్చేటప్పటికి (HE IS COME DOWN FINISH) అతడు కిందపడి పోయినట్లే. కానీ ఆ (మనసులేని) స్థితిలో ఉన్న వాడు అట్లే ఉంటాడు. (IT IS UN IMAGINABLE STATE) అది ఊహాతీత స్థితి. అటువంటి స్థితిలో ఉండి చూడు ఏమౌతుందో అన్నారు.

రమణానంద స్వామి : ఇప్పుడు అక్కడ వస్తువు ఉన్నది కదా స్వామి అనగా

గురువుగారు : నవ్వుతూ, మరలా నువ్వు వస్తువు అన్నావంటే మొదటికి వచ్చినట్టే అని అన్నారు.

రమణానంద స్వామి : ఉంది, ఉన్నదని తెలుస్తుంది అంటూ ఉండగా

గురువుగారు : ఉంది అంతే! ఉన్నది అన్న తర్వాత ఏమిటి? ఇంకేముంది అక్కడ ఆగు. ప్రశ్న, జవాబు లేదు. ప్రశ్న జవాబు లేనిస్థితి అది. ఊహించుట వీలు కాని స్థితి.

రమణానంద స్వామి : మీరు చెప్పారు కదా స్వామి ఈ విధంగా చేయాలి అని.

గురువుగారు : నిజమే అక్కడ నేను చెప్పింది ఇదే. అంతే ఇక అన్వేషణ చేసేది ఏమీ లేదక్కడ.

రమణానంద స్వామి : ఎంక్వయిరీ (విచారణ) చేయాలి కదా స్వామి.

గురువుగారు : నవ్వుతూ ఎవరు చేస్తున్నారు? (WHO IS DOING IT) ఎవరో చేయాలి కదా. ఆ చేసేది ఎవరు' (ఇక్కడ మనం అర్థం చేసుకోవలసిన విషయం. నేను ఆత్మను కాదు అని అనుకున్నప్పుడు అన్వేషణ అవసరం. కానీ నేను ఆత్మగా ఉన్నప్పుడు అన్వేషణ అవసరం లేదు.)

రమణానంద స్వామి : అన్వేషణ అంటే మనసుతో వస్తుంది కదా స్వామి.

గురువుగారు : నిజమే కానీ ఆ (సచ్చిదానంద) స్థితిలో అది (మనసు) లేదు. అది ఊహాతీతం, వర్ణనాతీతం.

రమణానంద స్వామి : మైండ్ (మనసు)తో చేస్తూ ఉంటేనే కదా స్వామి

గురువుగారు : మైండ్ (మనసు) వచ్చింది అంటే నీ పని అయిపోయినట్టే.

రమణానంద స్వామి : విచారణ అనేది మనసుతో చేయాలి కదా స్వామి.

గురువుగారు : నిజమే! అది దేని కోసం?.

రమణానంద స్వామి : మనం చేస్తూ చేస్తూ పోతూ ఉంటే (మైండ్లెస్ స్టేట్) మనసు లేని స్థితి వస్తుంది. అది రావడానికి అయినా మనం ప్రయత్నం చేయాలి కదా! మనం ఏదో చేయాలి.

గురువుగారు : అది, మనసు లేని స్థితి (మైండ్ లెస్ స్టేట్) రైట్. అది వర్ణించుటకు వీలులేనిది. అదే ఉన్నది. కానీ ఏదో చేయాలి అనేది లేదు. ఆ స్థితివస్తుంది. అక్కడ రెండు లేవు. మీరు చెప్పేది ఆ స్థితికి పోవడానికి కదా! అని, నేను చెప్పేది ఆ స్థితిలో అది తప్ప ఏదీ లేదని.

రమణానంద స్వామి : ఆ స్థితిలో ఎక్కువసేపు ఉండాలి కదా స్వామి. తర్వాత ఇమేజినేషన్ (ఊహ లేక ఆలోచన) చేస్తుంది ఆ మనసు.

గురువుగారు : ఇమేజినేషన్ (ఊహ లేక ఆలోచన) చేస్తుంది అంటున్నారక్కడ. మనసు అంటున్నారు. కానీ ఆ స్థితి ఊహించలేనిది, వర్ణించలేనిది. (ANYWAY YOU PURSUE THAT).

కొంతసేపటి తర్వాత

రమణానంద స్వామి : (ALL OUR DECISIONS ARE USELESS) మన నిర్ణయాలన్నీ పనికి రానివి అన్నారు కదా స్వామి. మనం ఏదో ఒకటి అంటుండగా

గురువుగారు : అవును ఏదో ఒకటి చేయాలి. కానీ అన్ని వివరాలు ఉన్నాయా? అక్కడ

రమణానంద స్వామి : (RESOLUTION) స్పష్టత ఏమి చేసుకోకూడదు అంటారా! స్వామి.

గురువుగారు : ఏమీ లేదు అక్కడ. ఆ (స్టేట్) స్థితిలో ఏమీ లేదు. అన్నీ వదిలేయాలండి, అన్నింటినీ!.

రమణానంద స్వామి : (థాట్స్) ఆలోచనలు వస్తాయనుకో స్వామి ఆలోచన ప్రవాహం వస్తుంది దాన్ని ఏం చేయాలి?.

గురువుగారు : అక్కడ పోవాలి. అక్కడి వరకు చేయాలి. (THOUGHLESS STATE) ఆలోచన లేని స్థితి. కానీ అక్కడికి వచ్చినప్పుడు అది వర్ణించలేని స్థితి.

రమణానంద స్వామి : అబ్జర్వేషన్ (గమనించుట) చేయాలి.

గురువుగారు : అబ్జర్వేషన్ (గమనించుట) చేయాలి. సాక్షీభూతం అంటారు. సాక్షిగా ఉంటుంది ఆ సచ్చిదానంద పరమాత్మ అనేది.

రమణానంద స్వామి : ఆ స్థితి కొద్దిసేపు ఉంటుంది. కొన్ని సెకన్లు మాత్రమే ఉంటుంది కదా స్వామి.

గురువుగారు : ఆ స్థితి అప్పటిదాకా ఉంటుంది. ఎప్పుడూ ఉంటుంది. కొన్ని సెకన్లు మాత్రమే కాదండి బాగా అంతవరకు ఉంటుంది. కానీ ఆ స్థితి వచ్చినప్పుడు వాళ్లకు ఇదంతా లేదు.

రమణ మహర్షి ఉన్నారు ఆయనకు నిజంగా ఆ స్థితి తెలుసు. చూడు ఆ ఫోటో చూడు (ఫోటో చూపిస్తూ) యుక్త వయసులో ఆ

స్థితిని పొందారు. గోచి పాత పెట్టుకుని ఉన్నారు. అని పూజ గదిలో ఫోటోలను చూపిస్తూ దాన్ని వివరించడం ఎలా ఆ ఫోటో, ఈ ఫోటో ఒకటేనా? పరిస్థితులు వేరేగా ఉంటాయి. రామకృష్ణ పరమహంస కూడా దీనిని వివరించారు. కానీ ఈయన (రమణ మహర్షి) పద్ధతి చూడండి అక్కడ ఏమీ లేదు. అని ఫోటోలు చూపించి చెప్పారు. పక్కన మౌనంగా కూర్చుని ఉన్న నా వైపు చూపిస్తూ ఇప్పుడు నువ్వు ఈయన సమానం అంటారా? కాదు. ఏదో తేడా ఉంది. అలాగని వివరణ చేస్తామా? చేయుము. అని నవ్వుతూ, ఇప్పుడు ఈయనను మా వాళ్ళంతా పిచ్చివాడు అంటారు. నాతో నువ్వు ఎందుకు చెడగొడతావు ఆయనను అంటారని చెప్తూ, నాపై కృపా వర్షం కురిపించారు.

ఒకరోజు ఉదయం గురువుగారు, నేను సూర్యుని చూస్తూ కూర్చున్నాము. ఆ సమయంలో వైజయంతి మాత వచ్చి గురువు గారిని లోపలికి రండి స్వామి టైం అయింది అన్నారు. అందుకు గురువుగారు బదులివ్వక మౌనంగా కూర్చుని ఉండడం చూసి ఆయన (గురువుగారు) ఒక పిచ్చి వారు ఈయన (నన్ను) ఒక పిచ్చి ఆయన మధ్యలో మేము చస్తున్నామని అనడం జరిగింది. (గురువుగారి పిచ్చికి సమానమైన పిచ్చి అందరూ కోరుకోదగినది.)

కళా మాత ఒకసారి గురువుగారి ఆరోగ్య విషయాలను చర్చిస్తూ, అప్పారావుగారితో గురువుగారు తమ ఆరోగ్య విషయాన్ని పట్టించుకోరని, అంతా మరిచిపోయారని గురువుగారికి 'ఏమీ తెలియదని' చెప్తూ పక్కనే ఉన్న నన్ను చూపిస్తూ ఈయనకు 'ఏమి తెలియదు' అని చెప్పడం జరిగింది. (భౌతికాన్ని మరచి ఏమీ

తెలియని స్థితిలో ఉండటమే నిజమైన జ్ఞానం అని రమణ మహర్షి చెప్పారు). గురువు గారి విషయంలో ఇది స్పష్టమవుతుంది. ఒకరోజు మహేందర్ అనే గురువుగారి భక్తుడు గురువు గారిని కలిసి స్వామి ఇంతకు ముందు క్లాసుల్లో ఉపనిషత్తు వాక్యాలని చెప్పేవారు కదా! అవన్నీ గుర్తున్నాయా? స్వామి అని అడిగితే దానికి సమాధానంగా గురువుగారు ఏమి గుర్తులేదయ్యా అంతా మర్చిపోయా' భగవంతుడు అంతా మర్చిపోయేలా చేసి చాలా మేలు చేశారని సంతోషాన్ని వ్యక్తం చేసినట్లు అతను నాతో చెప్పారు.

మరోసారి జయభారత్ హాస్పిటల్ లో ఫిజియోథెరపీ డాక్టర్ ను కలిసినప్పుడు గురువుగారు కింద కూర్చోవటం ప్రాక్టీస్ చేస్తున్నారని అందుకు తగిన శక్తి లేదని కళామాత డాక్టర్ గారికి చెప్పారు. డాక్టర్ గారు దానికి తగిన జాగ్రత్తలు చెబుతున్న సమయంలో నేను వెళ్లాను. కళా మాత డాక్టర్ గారికి నన్ను చూపిస్తూ ఇదిగో ఈయన, స్వామీజీ ఇద్దరు తోడు దొంగలు ఎవరూ లేనప్పుడు చూసి ప్రాక్టీస్ మొదలు పెడతారని చెప్పడం జరిగింది.

(గురువు గారి తోటి ఆ పోలికలు ఎంత భాగ్యానందదాయకమైనవో కదా!)

మార్చి 13, 2019 రాత్రి 7:00 సత్సంగం అయిన తర్వాత నేను ఆహారం తీసుకొని వచ్చి గురువుగారి దగ్గర మౌనంగా కూర్చున్నాను. రమణానంద స్వామి గురువుగారి పాదాలకు నూనె రాసి అక్కడే కూర్చున్నారు.

గురువుగారు : (ESSENCE OF I AM) ఎసెన్స్ ఆఫ్ ఐ యాం అన్నారు.

రమణానంద స్వామి : ESSENCE OF i AM మా! స్వామి

గురువుగారు : ONLY "I" I AM కూడా కాదు. అని ఏమిటా? నేను అంటున్నావు, ఏమిటి నేను?

రమణానంద స్వామి : I AM NOT THIS BODY (నేను శరీరం కాదు), I AM NOT THIS MIND (నేను మనసు కాదు) అని అనుకోకూడదా? స్వామి.

గురువుగారు : అదంతా ఏమీ ఉండకూడదు. ఇక్కడ అదంతా లేదు.

కళామాత : రమణానంద స్వామి తో అదేదో పాట కదా? అన్నారు.

రమణానంద స్వామి : కాదు. స్వామి శివానంద చెప్తారు I AM NOT THIS BODY, I AM NOT THIS MIND, I AM NOT INTELLECT MORE THAN SELF I AM అని.

గురువుగారు : నవ్వుతూ కాబట్టి ఆ విధంగా DISCUSS (విచారణ) చేయండి పోనీ. YOU DISCUSS WHATEVER IT IS TO LEARN TO THIS WAY అన్నింటిలో వచ్చి సర్వసాధారణంగా చెప్పేది ఇదే. 'I' నేను గారు అంటే ఏమిటి? కాబట్టి అది ఏమిటో కనుక్కోండి.

రమణానంద స్వామి : ఇంక్వైరీ (విచారణ) ఎక్కడ మొదలుపెట్టాలి స్వామి.

గురువుగారు : అదే, అదే ప్రశ్న ఇప్పుడు HOW TO START IT (ఎలా మొదలు పెట్టాలి) అనేదే ప్రశ్న కదా?

రమణానంద స్వామి : అవును.

గురువుగారు : BUT WHO IS THE QUESTIONER. WHO IS RISE THIS QUESTION. ప్రశ్న వేస్తున్నారు బాగానే ఉంది. కానీ ఎవరాయన అడిగేది, అడిగే ఆసామి ఎవరు అని POINT OUT (అంటున్నారు) చేస్తున్నారాయన (రమణ మహర్షి). ఈ 'నేను' అనేది ఈ విధంగా చర్చించేదానికి అవ్వదు. THIS IS PHILOSOHPHY AND THIS PHILOSOPHTY IS THERE. YOU PLEASE LOOK AT IT AND FIND OUT WHAT IS IT. DISCUSSION IS VERY DEEP AND YOU HAVE TO FIND IT. (SO) కాబట్టి INVESTIGATION OF SELF IS BEING. I AM EVERYWHERE IT.

రమణానంద స్వామి : మధ్యలో ఆలోచనలు వస్తాయి కదా (HOW TO BREAK IT) వాటిని అడ్డుకోవడం ఎలా?

గురువుగారు : HOW TO BREAK IT అంటున్నారు BUT WHO IS TRYING TO BREAK IT ? ప్రశ్న వేసే వారెవరో అడుగుతున్నారు కదా! ఎవడు వాడు? అడిగే వాడు ఎవరు అంటున్నా రాయన అన్నారు.

వైజయంతి మాత : గురువుగారికి ఆహారం ఇవ్వటానికి వచ్చి వాడు, వాడే! అన్నారు.

గురువుగారు : ఎవడా! వాడు? (INVESTIGATION) విచారణ చేసే దానికి ఒక (POWER) శక్తి అదంతా ఏమీ లేదు అక్కడ. ప్రశ్న వేసేది ఎవరు? నేను గారు ఎవరు? (STARTING POINT IS THERE) ప్రారంభ స్థానం అక్కడ ఉంది.

నేను : **SIMPLY STAY THERE AND FEEL IT** (కేవలం ఆ స్థితిలో నిలబడి దానిని అనుభూతి చెందాలి) అన్నాను.

గురువుగారు : THAT'S ALL (అంతే!), **OBSERVE THE OBSERVER** (చూచే వానిని చూడండి లేదా అన్వేషించే వానిని అన్వేషించండి) అని సెలవిచ్చారు.

మార్చి 15, 2019 రాత్రి ధ్యానం అనంతరం గురువుగారు సత్సంగంలో ఆ రోజు నాకు కలిగిన అనుభవాన్ని స్పష్టం చేస్తూ ఇలా సెలవిచ్చారు.

యోగి, మహర్షి, ఋషి అని చెప్తారు. **'చేసేటటువంటి యోగం, ధ్యానం లాంటివి అన్నీ కూడా ఒకే విషయాన్ని తెలుసుకోవడం కోసమే. పద్ధతులు, అనేక రకాలుగా పెట్టే పేర్లు వేరు కానీ అవన్నీ ఒకే విషయం పైన ఆధారపడి ఉంటాయి. ఆ సచ్చిదానంద పరబ్రహ్మ స్థితిని తెలియజేయబడేవే ఇవన్నీ కూడా, పుట్టినప్పటి నుంచి ఆవిధంగా ఉంటూ దానికోసమే ప్రయత్నిస్తున్నారు. ఆ విధమైనటువంటి సచ్చిదానంద పరబ్రహ్మ పరిస్థితిలో ఏమీ ఉండవు. అంతా ఒక్కటే అయిపోతుంది. ఆడ, మగ తేడా ఉండదు. అరుపులు, అభ్యంతరాలు ఉండవు. కేవలం సచ్చిదానందం మాత్రమే ఉంటుంది. ఆ విధంగా మనం చూసినట్లయితే అంతా ఒక్కటైపోతుంది. అదే సమాధి స్థితి. ఆ స్థితిని చేరుకోవడమే మన ప్రధాన లక్ష్యం'** అని సెలవిచ్చారు. సూర్యుని స్థితి లాగా అలా ఉండటమే అని సూర్యుని ఉదాహరణగా కూడా చెప్పారు.

మార్చి 22, 2019 నాటి సత్సంగంలో గురువు గారి సందేశం.

ఇది ప్రశ్న. పరిశ్రమ జరుగుతుంది. అది సరిగా జరుగుతుందా లేదా అని తెలుస్తుంది. ఎవరికి వారు తెలుసుకోవాలి. **సాధనలో ఆ (ACHIEVEMENT) ఉత్తీర్ణత వచ్చిందంటే అర్థం ఇక నువ్వు చేయవలసింది ఏమీ లేదు అక్కడ. పరిశ్రమ చేయడం అంటే 'అదిగా ఉండడమే". "చేసేవాడు లేడు చేయబడేది లేదు".** అది గా ఉంటారు అందరూ గట్టిగా ప్రయత్నం చేసే వాళ్ళు' ఏ లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నం చేస్తారో అది సాధిస్తారు, సాధించారు అని మౌనం వహించారు.

కొంతసేపటి తర్వాత వైజయంతి మాత గురువు గారితో ఏమి నాయనా అన్నారు.

గురువుగారు : ఏమి నాయనా అనే వారే లేరు అక్కడ. 'అన్వేషించ బడేది, అన్వేషించే వారు లేరు' అంతా ఒక్కటే అయి ఉన్నది. 'దాన్ని వర్ణించే దానికి ఏమీ లేదు అది గా ఉన్నావు నువ్వు అంతే' అని సెలవిచ్చారు.

మార్చి 23, 2019 నాటి సత్సంగంలో ధ్యానం ముగిసిన తర్వాత మాతాజీ, గురువు గారితో మంచినీళ్లు ఇవ్వమంటారా కాస్త అన్నారు. గురువు గారు మనం తాగుతాము దాన్ని వదిలి పెట్టమంటారు ఆ భావాన్ని. (తాగడం, తినడం అన్నది శరీరానికి సంబంధించిన విషయం కాబట్టి ఆ భావాన్ని వదిలివేయాలని చెప్పారని అర్థం చేసుకోవాలి) పరిశీలించి చూస్తే లోపలంతా ఒకటిగా అయిపోతుంది. అణువులు, పరమాణువులు అంటారు. విశ్లేషించి చూస్తే ఏమీ లేదు అక్కడ. 'సర్వం శక్తిమయం జగత్" అంటారు. ఒకటే శక్తి భౌతికంగా భిన్నంగా చూస్తారని చెప్పగా, నేను చూసే

దృష్టిని బట్టి అన్న వెంటనే గురువుగారు నా మాటను అందుకొని భిన్నంగా కనిపిస్తుంది. కానీ లోపలికి పోయి చూస్తే అంతా ఒక్కటే. **(PROTOPLASM) ప్రోటోప్లాజం అనేది బయటకు కనిపిస్తుంది. కానీ లోపలికి పోయి చూస్తే ఏమీ లేదు అక్కడ. లోపలికి పోయి చూస్తే 'ఏకత్వమే' కనిపిస్తుంది.**

అంతేనండి **'సత్యాన్ని గుర్తించండి అసత్యాన్ని వదిలిపెట్టండి". "ఏకత్వం మహత్త్వం"** అని సెలవిచ్చారు.

మే 29, 2019 న రమణ మహర్షి రచించిన ఉపదేశసారం లోని 22వ శ్లోకం యొక్క ఏకాత్మ తత్త్వం గురించి చదువుతున్నప్పుడు ఉనికి సర్వాంతర్యామియై ఎరుగుటయే అన్న విషయాన్ని చదివిన వెంటనే ఆ నెల 18వ తారీకున గురువుగారి సన్నిధిలో జరిగిన సందర్భాన్ని గుర్తు తెచ్చుకున్నాను. ఆరోజు అప్పారావు గారు, గురువుగారి దర్శనానికై వచ్చి వారి దగ్గర కూర్చుని ఉన్నారు. అప్పుడు మాతాజీ ఎవరు స్వామీ ఆయన అని గురువు గారితో అంటే గురువుగారు సమాధానంగా ఆయన సర్వాంతర్యామి అన్నారు. దానికి అతను మీరే స్వామి సర్వాంతర్యామి అన్నారు. తర్వాత గురువుగారు నా వైపు చూపిస్తూ ఈయన కూడా అలాంటి వారే అన్నారు. ఇక్కడ గురువు గారు కొన్ని విషయాలను స్పష్టం చేశారు.

- గురువుగారు అంతటా సర్వాంతర్యామిని దర్శిస్తున్నారన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నారు.

- ఇతకుముందు గురువుగారు 'ఏకత్వం మహత్త్వం' అని ఇచ్చిన

సందేశం ప్రకారం అంతటా ఉన్నది ఏకాత్మ తత్త్వమే అన్న సత్యాన్ని తెలియజేస్తున్నారు.

– శ్లోకము లోని వివరణ ప్రకారం విగ్రహం లాగా ఉన్న జడమైన శరీరాలను కాక ఏకాత్మ తత్వాన్ని ప్రదర్శిస్తూ, అక్కడ వ్యక్తుల పేర్లు చెప్పక 'సర్వాంతర్యామి' అని సంబోధించడం జరిగింది.

రమణ మహర్షిపై శ్లోకంలో 'ఏకసత్' అనే పదం ఉపయోగించారు. గురువుగారు స్వానుభూతి లో 'ఏకత్వం మహత్వం' అని చెప్పడం జరిగింది.

ఒకరోజు గురువుగారు ధ్యాన మందిరం చుట్టూ నడిచి వచ్చి కృష్ణ మందిరంలో కుర్చీలో కూర్చుంటూ ఈ కళేబరాన్ని మోయలేక చస్తున్నామండి అన్నారు. దీని ద్వారా జ్ఞానికి శరీరం భారంగా తోస్తుంది, శరీరాన్ని ఎప్పుడు వదిలించుకుందామా! అని చూస్తుంటారు అన్న శాస్త్ర వాక్యాన్ని ఋజువు చేస్తున్నారు.

ఇంకో రోజు గురువుగారు ధ్యాన మందిరం చుట్టూ తిరిగి, కృష్ణ మందిరానికి వచ్చిన వెంటనే కళా మాత, గురువుగారిని ఎన్నిసార్లు తిరిగారు స్వామి అని అడిగారు. సమాధానంగా అప్పారావు గారు ఆగకుండా తొమ్మిది (రౌండ్లు) తిరిగారని చెప్పగా కళామాత, గురువుగారి దగ్గరకు వచ్చి ఆగకుండా తొమ్మిది (రౌండ్లు) సార్లు తిరిగారా!, స్వామీజీ కాళ్లు నొప్పులు వేయలేదా! అని అడిగారు. సమాధానంగా గురువు గారు కాళ్లా!, నొప్పులా! ఎక్కడున్నాయి అవి అన్నారు. దీని ద్వారా గురువుగారు ప్రపంచంతో పాటు తమ శరీరాన్ని కూడా తనకు వేరుగా చూస్తూ వారు స్వయం పరబ్రహ్మగా

ఉన్నారని, అంతటా బ్రహ్మమే దర్శించు వారికి కాళ్లు ఉన్నాయా! అని, వానికి కలిగే నొప్పులు ప్రత్యేకంగా గోచరిస్తున్నాయా! అని ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తున్నట్లు స్పష్టం అవుతున్నది.

ఇటువంటి అద్భుత సన్నివేశాలెన్నో గురువుగారి సమక్షంలో జరిగేవి. వీటి ద్వారా గురువుగారి యొక్క జ్ఞానా జ్ఞానాలకు అతీతమైన, ఉత్కృష్ట యోగ స్థితి మనకు స్పష్టమవుతున్నది.

ఫిబ్రవరి 10, 2020 సాయంత్రం గురువుగారి దగ్గర కూర్చుని ఉన్నాను. అప్పుడు సమయం అయిదు గంటల 50 నిమిషాలు అయినది. నేను గురువుగారితో 12వ తేదీ యోగి రామయ్య గారి ఆరాధన స్వామి అన్నాను. గురువుగారు కాదు అన్నట్లు (YOUR IDENTITY IS CORRECTION) అన్న వాక్యాన్ని ఉపయోగించారు. నేను ఎందుకు అలా అన్నారా! అని ఆలోచిస్తూ ఆరు గంటలకు పూజ ప్రారంభించాను. అప్పుడే నాకు తోచింది గురువుగారు, యోగి రామయ్య గారిని ఒక శారీరక రూపంగా కాక ఇప్పుడు, ఇక్కడే ఉన్న సర్వాంతర్యామి గాను చావు పుట్టుకులకు అతీతమైన ఏకైక దృష్టిలో చూస్తున్నారని. ఆ విధంగా చూసినప్పుడు ఆరాధన అనేది పేరుకు మాత్రమే నని, వాస్తవ దృష్టిలో అది నిజం కాదని. పూజ అయిన తర్వాత ఆహారం తీసుకుని గురువు గారికి నమస్కరించి వస్తుండగా గురువుగారు నన్ను వెనక్కి పిలిచి ఇలా ఉపదేశించారు. ఇదిగో భగవాన్ చెప్పింది "**ఏకం, ఏకత్వమే**" అని చెప్పారు. దీని ద్వారా ముందు నాకు తోచిన విషయాన్ని మరింత స్పష్టం చేశారు.

ఆ విధంగా గురువు గారు **అద్వితీయ పరతత్త్వమైన ఆత్మ స్వరూపాన్ని ఎడతెరిపి లేకుండా అవలోకిస్తూ పరమోత్తమ శుద్ధ మౌనాన్ని ఆశ్రయించి** మాకు తరణోపాయ మార్గాన్ని చూపించి, నడిపిస్తున్నారు.

ఈ విధంగా నన్ను కరుణించిన ప్రత్యక్ష దైవ సమానులు అయినటువంటి గురుదేవులకు నన్ను నేను సమర్పించు కుంటున్నాను.

శ్రీ గురు చరణార్పణమస్తు.



పూజ్యశ్రీ స్వామి ప్రజ్ఞారణ్య మహరాజ్




భగవాన్ శ్రీ రమణమహర్షి
యోగి రామ యతీశ్వరులు
స్వామి ప్రజ్ఞారణ్య మహారాజ్